VC NEWS

# వేగుచుక్క

పీడిత ప్రజల గొంతుక...

TELUGU DAILY NEWS

www.veguchukkanews.com

నిజామాబాద్ మంగళవారం 23 జూలై 2024

వెల: రూ.3/- పేజీలు : 4 సంపుటి:01 సంచిక: 368




2లో

## దేశ ఆర్థిక వృద్ధి 6.5 నుంచి 7 శాతం

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD

# వాడీవేడి చర్చలే

- నేటి నుంచి అసెంబ్లీ సమావేశాలు
- జాబ్ క్యాలెండర్ ప్రకటించనున్న సర్కారు
- సభ ముందుకు నైపుణ్య వర్సిటీ, విద్యా కమిషన్, రెవెన్యూ బిల్లులు
- హామీల అమలుపై నిలదీయనున్న విపక్షాలు



హైదరాబాద్: రాష్ట్ర శాసనసభ సమావేశాలు మంగళవారం ప్రారంభం కానున్నాయి. ఈ బడ్జెట్ సమావేశాలను ప్రభుత్వం సుమారు 7-10 రోజుల పాటు నిర్వహించే అవకాశాలున్నాయి. తొలిరోజు సభ ప్రారంభం కాగానే.. కంటోన్మెంట్ దివంగత ఎమ్మెల్యే లాస్య నందిత మృతికి సంతాపంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీర్మానం ప్రవేశపెడతారు. అనంతరం సభ వాయిదా పడుతుంది. బడ్జెట్ సమావేశాలను ఎన్ని రోజులు నిర్వహించాలనే అంశంపై మంగళవారమే స్పీకర్ సమక్షంలో 'బిజినెస్ ఎడ్వైజరీ కమిటీ(బీఏసీ)' సమావేశమవుతుంది. శాసనసభ నిర్వహణ తేదీలను, ఎజెండాను ఇందులో ఖరారు చేస్తారు. 25న ఉదయం 9 గంటలకు సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన క్యాబినెట్ సమావేశమై.. బడ్జెట్‌కు ఆమోదం తెలుపుతుంది. అనంతరం అసెంబ్లీలో డిప్యూటీ సీఎం, ఆర్థికశాఖ మంత్రి భట్టివిక్రమార్క పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశపెడతారు. గత డిసెంబరులో కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఫిబ్రవరిలో తాత్కాలిక బడ్జెట్‌ను అసెంబ్లీ ఆమోదించింది. తాజాగా కేంద్ర ప్రభుత్వం పూర్తిస్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెట్టనుండటంతో.. రాష్ట్ర ప్రభుత్వం కూడా అదే తీరును అనుసరిస్తోంది. అధికార, విపక్షాల సవాళ్లు.. ప్రతి సవాళ్ల మధ్య ఈ సమావేశాలు వాడీవేడిగా కొనసాగే అవకాశాలున్నాయని పరిశీలకులు భావిస్తున్నారు. ఒకవైపు భారాస ప్రభుత్వ హయాంలో వైఫల్యాలు చోటుచేసుకున్నాయని ప్రస్తావిస్తూనే.. మరోవైపు తమ ప్రభుత్వం ఏర్పడిన ఏడు నెలల వ్యవధిలో అమలు చేసిన సంక్షేమ పథకాలను అధికారపక్షం అసెంబ్లీలో ప్రస్తావించనుంది. ఉద్యోగాల భర్తీ, డీఎస్సీ, గ్రూప్-1 నోటికేషన్ల జారీ, రూ.500కే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం తదితర పథకాల అమలు తీరుపై అసెంబ్లీ వేదికగా ప్రభుత్వం చర్చించనుంది. రూ.2 లక్షల రుణమాఫీ అమలుతో రైతులకు కలిగిన లబ్ధిని వివరించనుంది. నిరుద్యోగులకు ఇచ్చిన హామీ అమలు దిశగా జాబ్ క్యాలెండర్ ప్రకటించనుంది. రైతు భరోసా విధివిధానాలపైనా చర్చించనుంది. మేడిగడ్డపై తన వైఖరిని కూడా సమావేశాల్లో ప్రభుత్వం ప్రకటించనున్నట్లు తెలుస్తోంది. ఫోన్ ట్యాపింగ్ అంశాన్ని ప్రస్తావించే అవకాశాలూ ఉన్నాయి. తెలంగాణ తల్లి విగ్రహం, ప్రభుత్వ చిహ్నం రూపకల్పనపై అసెంబ్లీ సమావేశాల్లో చర్చించి తుది నిర్ణయం తీసుకుంటామని గతంలో సీఎం ప్రకటించడంతో.. వీటిపైనా చర్చించే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. సంక్షేమ పథకాలను అక్రమంగా పొందినవారి నుంచి రికవరీ చేసేందుకు అనుసరించాల్సిన విధివిధానాలపై సమావేశాల్లో చర్చించి తుది నిర్ణయం తీసుకోనున్నారు. తెలంగాణ యూనివర్సిటీ, విద్యా కమిషన్, రెవెన్యూ తదితర బిల్లులను కూడా సభలో ప్రవేశపెట్టనున్నట్లు తెలుస్తోంది.

### బడ్జెట్ రోజున కేసీఆర్ హాజరు!

గత డిసెంబరులో జరిగిన శాసనసభ సమావేశాలకు శస్త్రచికిత్స కారణంగా భారాస అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ హాజరు కాలేదు. ఓటాన్ ఎకౌంట్ బడ్జెట్ సమావేశాలకూ ఆయన గైర్హాజరయ్యారు. ఇప్పుడు పూర్తిస్థాయి బడ్జెట్‌ను రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టనుండటంతో.. ఈ సమావేశాలకు హాజరవుతారా? లేదా? అనే అంశంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఈ నెల 25న బడ్జెట్ ప్రవేశపెట్టనున్న రోజు శాసనసభకు హాజరు కావాలని కేసీఆర్ నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. అధికారపక్షం చేసే విమర్శలకు దీటుగా సమాధానమివ్వడానికి భారాస సన్నద్ధమవుతోంది. గత ఏడు నెలల కాంగ్రెస్ ప్రభుత్వ పాలన తీరును అసెంబ్లీలో ప్రస్తావించడానికి సిద్ధమవుతోంది. దీనిపై చర్చించడానికి భారాస శాసనసభపక్షం మంగళవారం మధ్యాహ్నం ఒంటి గంటకు తెలంగాణ భవన్‌లో సమావేశం కానుంది. పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలందరూ సమావేశానికి హాజరు కావాలని ఇప్పటికే అధిష్ఠానం నుంచి ఆదేశాలు వెళ్లాయి. అసెంబ్లీ సమావేశాల్లో భారాస ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అనుసరించాల్సిన వ్యూహాలపై కేసీఆర్ ఈ సమావేశంలో దిశానిర్దేశం చేస్తారని పార్టీ వర్గాలు తెలిపాయి. కాంగ్రెస్‌లో చేరిన 10 మంది భారాస ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని సభలో భారాస డిమాండ్ చేయనున్నట్లు తెలుస్తోంది. నిరుద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలు, జాబ్ క్యాలెండర్ విడుదల.. శాంతిభద్రతలు.. చేనేత కార్మికుల ఆత్మహత్యలు.. ఆరు గ్యారంటీల అమలుకు చట్టబద్ధత.. రైతు రుణమాఫీ, పంటలకు బోనస్, రైతు భరోసా చెల్లింపు.. గ్రామాలు, పట్టణాలకు నిధుల విడుదలలో అలసత్వం.. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విడుదల.. విద్యార్థుల సమస్యలు తదితర అంశాలపై అసెంబ్లీలో చర్చించడానికి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని భారాస నిర్ణయించినట్లు సమాచారం. బీఏసీ సమావేశానికి భారాస పక్షాన మాజీ మంత్రి హరీశ్‌రావు హాజరు కానున్నట్లు తెలిసింది. అసెంబ్లీలో ప్రతిపక్ష పార్టీ సభ్యుడికి ఇచ్చే 'పబ్లిక్ ఎకౌంట్స్ కమిటీ' ఛైర్మన్ పదవిని ఆయనకే ఇచ్చే అవకాశాలున్నట్లు సమాచారం.ఎన్నికల హామీల అమలుకు పట్టుబట్టనున్న భాజపా!బడ్జెట్ సమావేశాల్లో ప్రభుత్వాన్ని పలు అంశాలపై గట్టిగా నిలదీయడానికి అస్త్రశస్త్రాలతో భాజపా సిద్ధమైంది. ప్రధానంగా ఎన్నికల హామీలను అమలు చేయాలని డిమాండ్ చేయనుంది.

## ఎమ్మెల్సీ కవితకు

### డిఫాల్ట్ బెయిల్‌పై విచారణ

ఆగస్టు 5కు వాయిదా వేసిన కోర్టు



**న్యూఢిల్లీ:**ఢిల్లీ లిక్కర్ స్కామ్ సీబీఐ కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితకు డిఫాల్ట్ బెయిల్‌పై విచారణ మరోసారి వాయిదా పడింది. సోమవారం కవిత బెయిల్ పిటిషన్‌పై ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టులో విచారణకు రాగా... ఆగస్టు 5కు కోర్టు వాయిదా వేసింది. నిర్దేశిత 60 రోజుల గడువులో పూర్తి స్థాయి ఛార్జ్‌షీట్‌ను దాఖలు చేయడంలో సీబీఐ విఫలం అయ్యిందని జూలై 8న కవిత తరపు న్యాయవాదులు పిటిషన్ వేసి వాదనలు వినిపించారు. సీబీఐ కవితను 2024 ఏప్రిల్ 11న అక్రమంగా అరెస్టు చేసిందని కోర్టుకు తెలిపారు. జూన్ 7న సీబీఐ అసంపూర్తి ఛార్జ్ షీట్ దాఖలు చేసిందని కవిత తరపు న్యాయవాదులు కోర్టుకు వెల్లడించారు. సీబీఐ చార్జ్‌షీటులో తప్పులు ఉన్నాయని కోర్టు కూడా పేర్కొంది. సీఆర్పీసీ167(2) ప్రకారం కవిత డిఫాల్ట్ బెయిల్ పొందే హక్కు ఉందని... ఏడు ఏళ్ళ శిక్ష పడే కేసులో 60 రోజుల వరకు మాత్రమే కస్టడీకి అవకాశం ఉందని... తాము డిఫాల్ట్ బెయిల్ పిటిషన్ దాఖలు చేసిన జూలై 6 తేదీ నాటికి కవిత 86 రోజుల కస్టడీ పూర్తి అయ్యిందని ఢిల్లీ కోర్టులో కవిత తరపు న్యాయవాదులు గతంలో వాదనలు వినిపించారు. ఈరోజు మరోసారి పిటిషన్‌పై విచారణకు రాగా.. కోర్టు ఆగస్టు 5కు వాయిదా వేసింది.కాగా.. ఢిల్లీ లిక్కర్ స్కాంలో అరెస్ట్ అయిన కవిత దాదాపు నాలుగు నెలలుగా తీహార్ జైలులోనే ఉన్నారు. ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో కేసులు నమోదు చేసిన సీబీఐ, ఈడీ... కవితను అదుపులోకి తీసుకున్నాయి. అయితే కవిత అరెస్ట్ నాటి నుంచి బెయిల్ కోసం తీవ్రంగా శ్రమిస్తున్నారు. అనేక మార్లు బెయిల్ మంజూరు చేయాలంటూ ఢిల్లీ రౌజ్ అవెన్యూ కోర్టులో కవిత తరపు న్యాయవాదులు పిటిషన్ వేయడం... అందుకు కోర్టు ధిక్కరచడం షరా మామూలుగా మారింది. దీంతో గత కొద్ది నెలలుగా కవిత జైలు జీవితాన్ని గడుపుతూ వస్తున్నారు. తాజాగా కవిత తరపున లాయర్లు కీలకమైన అంశాన్ని బెయిల్ పిటిషన్‌లో పొందుపరుస్తూ డిఫాల్ట్ బెయిల్ మంజూరు చేయాలని కోరారు. నిర్దేశిత 60 రోజుల గడువులో పూర్తి స్థాయి ఛార్జ్‌షీట్‌ను దాఖలు చేయడంలో సీబీఐ విఫలం అయ్యిందంటూ కవిత తరపు న్యాయవాదులు కోర్టులో పిటిషన్ వేశారు. పిటిషన్‌ను విచారించిన ఢిల్లీ కోర్టు మరోసారి వాయిదా వేసింది. దీంతో మరికొంత కాలం కవిత జైలులోనే ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది.



2లో

## నీట్ అవకతవలకపై సుప్రీంలో విచారణ

- నీట్ అవకతవలకపై సుప్రీంలో విచారణ
- ఒకే ప్రశ్నకు రెండు సమాధానాలపై చర్చ
- ముగ్గురు నిపుణులతో నేడు సమాధానం ఇవ్వాలన్న ధర్మాసనం
- మే 4కు ముందే పేపర్ లీకేజీ జరిగినట్లు సిజెఐ అనుమానం
- విచారణ నేటికి వాయిదా



2లో

## వైభవంగా మహంకాళి బోనాలు

- భవిష్యవాణి వినిపించిన మాతంగి
- విస్తారంగా వర్షాలు కురుస్తాయని వెల్లడి




2లో

## సభలో విపక్షాలు సమయాన్ని వృధా చేస్తున్నాయ్

- సమస్యలను ప్రస్తావించకుండా అడ్డుకునే యత్నాలు
- బడ్జెట్ సమావేశాలు సజావుగా సాగాలని ఆకాంక్ష : మోడీ

# తెలుగు రాష్ట్రాల్లో పొంగుతున్న వాగులు

**విజయవాడ/హైదరాబాద్**ఉభయ తెలుగు రాష్ట్రాల్లో భారీ వర్షాలకు వాగులు వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. ప్రధాన నదులు కృష్ణా, గోదావరులు పొంగుతున్నాయి. ప్రధానంగా గోదావరికి వరద పోటెత్తుతోంది. మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు గత మూడు రోజులుగా ప్రాణహిత, ఇంద్రావతి, తాలిపేరుల నుంచి వరద వచ్చి చేరుతోంది. తెలంగాణలోని గోదావరి పరీవాహకం లోనూ భారీ వర్షాలు పడుతుండటంతో కిన్నెరసాని, ముర్రేడు, కాళేశ్వరం ఎత్తిపోతల్లోని మేడిగడ్డ-అన్నారం బ్యారేజీల మధ్య వాగుల నుంచి పెద్దఎత్తున వరద వచ్చి గోదావరి నదిలో కలుస్తోంది. దీంతో ప్రవాహం పెరుగుతోంది. మేడిగడ్డ వద్ద 5.52 లక్షల క్యూసెక్కుల వరద ప్రవహిస్తోంది. అన్నారం బ్యారేజీకి 16,850 క్యూసెక్కుల ప్రవాహం వస్తుండడంతో 66 గేట్లు ఎత్తి అదేస్థాయిలో నీటిని విడుదల చేస్తున్నారు. ఇంద్రావతి కలిసిన అనంతరం సమ్మక్క బ్యారేజీ వద్ద 8.23 లక్షల క్యూసెక్కులు, దుమ్ముగూడెం సీతమ్మసాగర్ ఆనకట్ట వద్ద 9.01 లక్షల క్యూసెక్కుల ప్రవాహంతో గోదావరి ఉగ్రరూపం దాల్చుతోంది. భద్రాచలం వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక స్థాయి(43 అడుగులు)ని నది దాటింది. నదీ పరీవాహక ప్రాంతాల్లో వర్షాలు తగ్గక పోవడంతో మరికొంత పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. మూడు, నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలతో శ్రీరామసాగర్ జలాశయంలోకి ఎగువ నుంచి 18,518 క్యూసెక్కుల వరద చేరుతోంది. నిర్మల్ జిల్లాలోని కడెం నారాయణరెడ్డి జలాశయంలో ఆదివారం ఉదయం నాలుగు వరద గేట్లు ఎత్తారు. మధ్యాహ్నానికి వరద తగ్గడంతో ఒక గేటు మూసేసి మూడు గేట్ల ద్వారా నీటిని దిగువకు వదులుతున్నారు. కృష్ణా నదిలో ఎగువన వరద పెరుగుతోంది. కర్ణాటకలో ఆలమట్టి, నారాయణపూర్ జలాశయాల కింద అప్రమత్తత ప్రకటించారు. ఆదివారం సాయంత్రానికి ఎగువ నుంచి భారీ ప్రవాహాలు వస్తుండటంతో ఆలమట్టి నుంచి దిగువకు 1.50 లక్షల క్యూసెక్కుల




- గోదావరికి ఉధృంతగా వరదనీరు
- పరీవాహకాల్లోని ప్రాజెక్టుల్లో జలకళ
- శ్రీశైలానికి ఉరకలెత్తుతున్న కృష్ణా ప్రవాహం
- గోదావరి వరదపై మంత్రి పొంగులేటి సమీక్ష

నీటి విడుదలను ప్రారంభించారు. ఇది మరింత పెరిగే అవకాశాలు ఉన్నట్లు కర్ణాటక జలవనరుల

శాఖ అధికారులు అప్రమత్తం చేశారు. నారాయణపూర్ నుంచి 25 గేట్లు తెరిచి 1.45 లక్షల క్యూసెక్కులను దిగువకు వదులుతున్నారు. దీంతో జూరాలకు వరద పెరిగింది. ప్రాజెక్టు 22 గేట్లను తెరిచారు. శ్రీశైలం జలాశయం వద్ద 96 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదవుతోంది.

భారీ వర్షాల నేపథ్యంలో గోదావరి నది పరీవాహకంలోని లోతట్టు ప్రాంతాల్లో తగిన రక్షణ చర్యలు చేపట్టాలని పరీవాహక జిల్లాల కలెక్టర్లను రెవెన్యూ, విపత్తు నిర్వహణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశించారు. వరద పరిస్థితులపై ఆదివారం హైదరాబాద్‌లో అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. నదులు, వాగుల ప్రవాహాలతో ఆస్తి, ప్రాణ నష్టం వాటిల్లకుండా చర్యలు తీసుకోవాలని నిర్దేశిరచారు. కలెక్టరేట్లలో కంట్రోల్ రూంలను ఏర్పాటు చేసి.. సమన్వయం చేయాలని కోరారు. రెస్క్యూ బృందాలు, ఎన్డీఆర్ఎఫ్ బృందాల సాయాన్ని తీసుకోవాలని సూచించారు.




2 మంగళవారం 23 జులై 2024


# దేశ ఆర్థిక వృద్ధి 6.5 నుంచి 7 శాతం

**న్యూఢిల్లీ:** కేంద్ర బడ్జెట్ 2024..ప్రవేశపెట్టే ముందు.. ఆర్థిక సర్వేను పార్లమెంట్ లో ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ ప్రవేశ పెట్టారు. తేదీ లోక్ సభలో ప్రవేశపెట్టిన ఆర్థిక సర్వేలో చాలా కీలకమైన అంశాలు ఉన్నాయి. దేశ ఆర్థిక వృద్ధి 6.5 నుంచి 7 శాతంగా ఉంటుందని అంచనా. మార్కెట్ అంచనాలు చాలా ఎక్కువగా ఉన్నాయని.. అందుకు తగ్గట్టుగా రిస్క్ ఎక్కువగా ఉంటుందని.. అయినా వృద్ధి రేటును కొనసాగుతుందని ఆర్థిక మంత్రి స్పష్టం చేశారు. ద్రవ్యోల్బణం.. ధరల సూచి 4.5 శాతంగా ఉంటుందని.. 2026 నాటికి ధరల సూచిని 4.1 శాతానికి తగ్గించటమే లక్ష్యంగా ఉన్నట్లు స్పష్టం చేశారు.

దేశంలోని ప్రజలు 54 శాతం వ్యాధులు, రోగాలకు కల్తీ, అనారోగ్యకరమైన ఆహారమే కారణం అని.. ఈ విషయంలో మార్పు అవసరం అని ఆర్థిక సర్వే స్పష్టం చేసింది. సమతుల్యమైన ఆహారం, నాణ్యమైన ఆహారం వైపు మార్పు తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆర్థిక సర్వే చెబుతోంది. చైనా నుంచి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు భారీగా పెరిగినట్లు ఆర్థిక సర్వే వెల్లడించింది. దీని వల్ల దేశం నుంచి ఇతర దేశాలకు ఎగుమతులు పెంచటానికి ఈ పెట్టుబడులు ఎంతో ఉపయోగపడతాయని స్పష్టం చేసింది ఆర్థిక సర్వే. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్..ప్రభావం ఉద్యోగులు, కార్మికుల ఉపాధిపై తీవ్ర ప్రభావాన్ని చూపిస్తుంది.

# వివాదంలో ఐఏఎస్ స్మితా సబర్వాల్

## సివిల్స్ ఎంపికలో వికలాంగ కోటాపై పోస్ట్ తేనెతుట్టెను కదపడంతో పలువురు విమర్శలు

**హైదరాబాద్:** ట్రైనీ ఐఏఎస్ అధికారి పూజా ఖేద్కర్ వివాదం తర్వాత ఇప్పుడు సివిల్ సర్వీసెస్ ఎంపిక విధానం గురించి కొత్త చర్చ మొదలైంది. ఈ వివాదం నేపథ్యంలో తెలంగాణ కేడర్‌కు చెందిన ఐఏఎస్ అధికారి స్మితా సబర్వాల్ ఐఏఎస్‌లో వికలాంగుల కోటాపై తన అభిప్రాయాలను సోషల్ మీడియా ఖాతా 'ఎక్స్'లో పంచుకున్నారు. ఈ చర్చ ప్రస్తుతం ఊపందుకుంది. వైకల్యం ఉన్న పైలట్‌ను ఎయిర్‌లైన్ నియమించుకుంటుందా? లేదా మీరు వైకల్యం ఉన్న సర్జన్‌ని విశ్వసిస్తారా అంటూ పోస్ట్ చేశారు. సివిల్ సర్వీసెస్ అధికారుల బాధ్యత అనేది ఫీల్డ్ వర్క్, పన్నులు విధించడం, ప్రజల మనోవేదనలను నేరుగా వినడం వంటివి ఉంటాయి. కాబట్టి ఈ ప్రీమియర్ సర్వీస్‌కు ఈ కోటా అవసరమా అని తన అభిప్రాయాలను వెల్లడించారు. స్మిత సబర్వాల్ పోస్ట్ చూసిన నెటిజన్లు తీవ్రంగా స్పందిస్తున్నారు. వికలాంగుల హక్కుల కోసం ఉద్యమిస్తున్న కార్యకర్తలు ఐఏఎస్ అధికారి స్మితా సబర్వాల్ వ్యాఖ్యలను తీవ్రంగా విమర్శిస్తున్నారు. వికలాంగులను 'సంకుచిత దృక్పథం'తో చూడరాదని, వారి అర్హతపై ఇలా మాట్లాడటం సరికాదని అంటున్నారు. దీనిపై శ్రీకాంత్ మిర్యాల అనే రచయిత, సైకియార్టిస్ట్ ఓ సుదీర్ఘ పోస్ట్ పెట్టారు. ఈ పోస్టులో ప్రత్యక్ష ఉదాహరణలతో గతంలో ఎంబీబీఎస్ చదివేటప్పుడు తన ప్రిన్సిపాల్ కాలుకి పోలియో సోకి సరిగా నడవలేనివారు, అయినా కూడా ఎడమచేత్తో రాసి, పాఠాలు చెప్పారాని గుర్తు చేశారు. ఇలా అనేక మంది దివ్యాంగులు పలు రంగాల్లో ఉన్నట్లు గుర్తు చేశారు. అంతేకాదు ఉన్నత స్థానంలో ఉన్న అధికారులు ఇలా ట్వీట్ చేయడం సరికాదని కామెంట్లు చేస్తున్నారు. మీ పని మీరు సరిగ్గా చేయండి చాలు. అంతేకానీ మీకు

సలహాలు ఇచ్చే స్థాయి ఇంకా రాలేదని చెబుతున్నారు. అంతేకాదు గతంలో తెలంగాణ సీఎం కేసీఆర్ దగ్గర పనిచేసిన ఈ అధికారిపై అనేక అవినీతి ఆరోపణలు వచ్చాయి. ట్రైనీ ఐఏఎస్ అధికారి పూజా ఖేద్కర్‌పై అనుచిత ప్రవర్తన ఆరోపణల మధ్య ఈ వివాదం మొదలైంది. యూపీఎస్‌సీ పరీక్షలో తన అభ్యర్థిత్వాన్ని పొందేందుకు వైకల్యం, ఇతర వెనుకబడిన తరగతి కోటాను దుర్వినియోగం చేసినట్లు ఆమెపై ఆరోపణలు ఉన్నాయి. సివిల్ సర్వీసెస్ పరీక్షలో ఫేక్ ఐడెంటిటీ ఇచ్చి అనుమతించిన దానికంటే ఎక్కువ ప్రయత్నిం చారనే ఆరోపణలపై యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఖేద్కర్‌పై కేసు నమోదు చేసింది. ఈ క్రమంలో స్మిత వ్యాఖ్యలు పలువురి విమర్శలకు కారణమయ్యింది.

# మూసీ రివర్ ఫ్రంట్ అభివృద్ధికి రూ.పది వేల కోట్లుఇవ్వండి

**న్యూఢిల్లీ:** తెలంగాణ ప్రభుత్వ ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్‌కు జాతీయ నది పరిరక్షణ ప్డణాళిక కింద రూ.పది వేల కోట్లు కేటాయించాలని జల్‌శక్తి మంత్రి సి.ఆర్.పాటిల్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్ నగరంలో 55 కిలోమీటర్ల మేర ప్రవహిస్తున్న మూసీ నదిని దేశంలో మరెక్కడ లేని విధంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం దృష్టి పెట్టిందని కేంద్ర మంత్రికి ముఖ్యమంత్రి వివరించారు. ఢిల్లీలో కేంద్ర మంత్రులు సి.ఆర్.పాటిల్, హర్ దీప్ సింగ్ పూరీ, ప్రహ్లాద్ జోషిలను ముఖ్యమంత్రి సోమవారం కలిశారు. రాష్ట్రానికి సంబంధించిన వివిధ అంశాలను వారి దృష్టికి తీసుకెళ్లారు. హైదరాబాద్ నగరంలోని మురికి నీరు అంతా మూసీలో చేరుతోందని, దానిని శుద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించిందని జల్‌శక్తి మంత్రి సి.ఆర్.పాటిల్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. మూసీలో చేరే మురికి నీరును శుద్ధి చేయడం, వరద నీటి కాల్వల నిర్మాణం, స్థాయి పెంపు, మూసీ సుందరీకరణకు సహకరించాలని కేంద్ర మంత్రిని ముఖ్యమంత్రి కోరారు. జాతీయ నది పరిరక్షణ ప్రణాళిక కింద దక్కన్ పీఠభూమిలోని నదుల పరిరక్షణ, అభివృద్ధికి కేంద్రం యోచిస్తున్నందున మూసీలో కలిసే మురికి నీటి శుద్ధి పనులకు రూ.4 వేల కోట్లు కోట్లు కేటాయించాలని కోరారు. గోదావరి జలాలను ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్‌లతో నింపేందుకు ఉద్దేశించిన ప్రాజెక్టులకు రూ.6 వేల కోట్లు కేటాయించాలని కేంద్ర మంత్రి సి.ఆర్.పాటిల్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ రెండు చెరువులను గోదావరి నీటితో నింపితే హైదరాబాద్ నీటి ఇబ్బందులు తీరడంతో పాటు మూసీ నది పునరుజ్జీవనానికి తోడ్పడుతుందని ముఖ్యమంత్రి తెలిపారు. జల్ జీవన్ మిషన్ కింద



తెలంగాణకు నిధులు విడుదల చేయాలని జల్‌శక్తి మంత్రి సి.ఆర్.పాటిల్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. 2019 లెక్కల ప్రకారం జల్‌జీవన్ మిషన్ కింద రాష్ట్రంలో 77.60 శాతం ఇళ్లకు నల్లా నీరు అందుతోందని, ఇటీవల తాము చేపట్టిన సర్వేలో 7.85 లక్షల ఇళ్లకు నల్లా కనెక్షన్ లేదని తేలిందని వివరించారు. ఆ ఇళ్లతో పాటు పీఎంఏవై (అర్బన్), (రూరల్) కింద చేపట్టే ఇళ్లకు నల్లా కనెక్షన్లు ఇవ్వాల్సి ఉందని, ఇందుకు మొత్తంగా రూ.16,100 కోట్లు అవసరమవుతాయని కేంద్ర మంత్రికి ముఖ్యమంత్రి తెలియజేశారు. 2019లో జల్‌జీవన్ మిషన్ ప్రారంభించినా నేటి వరకు రాష్ట్రానికి నిధులు ఇవ్వలేదని, ఈ ఏడాది నుంచి నిధులు విడుదల చేయాలని ముఖ్యమంత్రి కేంద్ర మంత్రిని కోరారు. తెలంగాణలో రూ.500కే గ్యాస్ సరఫరాకు సంబంధించిన సబ్సిడీని ముందుగానే ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలకు (ఓఎంసీ) చెల్లించే సదుపాయాన్ని కల్పించాలని పెట్రోలియం, సహజ వాయువుల శాఖ మంత్రి హర్‌దీప్ సింగ్ పూరీకి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. కేంద్ర మంత్రి పూరీని పార్లమెంట్‌లోని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమవారం కలిశారు. ఈ సందర్భంగా మహాలక్ష్మి పథకంలో భాగంగా తమ ప్రభుత్వం రూ.500కే గ్యాస్ సిలిండర్ సరఫరా చేస్తున్న విషయాన్ని కేంద్ర మంత్రి దృష్టికి ముఖ్యమంత్రి తీసుకెళ్లారు. తాము ముందుగానే సబ్సిడీ చెల్లిస్తామని.. రూ.500కే గ్యాస్ సిలిండర్ సరఫరా చేయాలని గ్యాస్ ఏజెన్సీలను గతంలోనే కోరినా సానుకూలత వ్యక్తం కాలేదన్నారు. ప్రస్తుతం వినియోగదారులు సిలెండర్‌కు పూర్తిగా డబ్బులు చెల్లించిన తర్వాత సబ్సిడీ

అందుతుండడంతో ఇబ్బందికరంగా ఉందన్నారు. గ్యాస్ సిలిండర్లకు చెందిన సబ్సిడీని ముందుగానే ఓఎంసీలకు చెల్లించేందుకు అవకాశం కల్పించాలని కేంద్ర మంత్రికి ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు. అలా చేస్తే వినియోగదారులు రూ.500 చెల్లించి సిలిండర్ తీసుకునే అవకాశం కలుగుతుందన్నారు. ముందుగానే రాయితీని తాము ఓఎంసీలకు చెల్లిస్తున్నందున ఎటువంటి ఇబ్బందులు ఉండవన్నారు. అలా వీలుకాని పక్షంలో వినియోగదారులకు తమ ప్రభుత్వం చెల్లించే సబ్సిడీని 48 గంటల్లోపు అందేలా చూడాలని కేంద్ర మంత్రిని ముఖ్యమంత్రి కోరారు.ధాన్యం సేకరణ, బియ్యం సరఫరాకు సంబంధించి కేంద్ర ప్రభుత్వ నుంచి రావల్సిన బకాయిలు వెంటనే విడుదల చేయాలని కేంద్ర ఆహార, పౌరసరఫరాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. కేంద్ర మంత్రిని ముఖ్యమంత్రి సోమవారం కలిశారు. 2014–15 ఖరీఫ్ కాలంలో అదనపు లెవీ సేకరణకు సంబంధించి రూ. 1468.94 కోట్ల రాయితీని పెండింగ్‌లో పెట్టారని కేంద్ర మంత్రికి ముఖ్యమంత్రి తెలియజేశారు. అందుకు సంబంధించిన అన్ని పత్రాలను కేంద్ర ప్రభుత్వానికి సమర్పించామని గుర్తు చేశారు. అందువలన బకాయిపడిన ఆ మొత్తాన్ని విడుదల చేయాలని కేంద్ర మంత్రిని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరారు. ప్రధానమంత్రి గరీబ్ కళ్యాణ్ యోజన కింద 2021 మే నుంచి 2022 మార్చి వరకు సరఫరా చేసిన 89,987.730 మెట్రిక్ టన్నుల బియ్యానికి సంబంధించిన ఉత్తర్వులను ధ్రువీకరించుకొని

అందుకు సంబంధించిన బకాయిలు రూ.343.27 కోట్లను విడుదల చేయాలని కేంద్ర మంత్రి పూరీని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరారు. అలాగే 2021 మే నుంచి 2022 మార్చి వరకు నాన్ ఎన్ఎఫ్ఎస్ఎ (నేషనల్ ఫుడ్ సెక్యూరిటీ యాక్ట్) కింద పంపిణీ చేసిన బియ్యానికి

సంబంధించిన బకాయిలు రూ.79.09 కోట్లు వెంటనే విడుదల చేయాలని కేంద్ర మంత్రికి ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు. ముఖ్యమంత్రి వెంట ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి, ఖమ్మం, జహీరాబాద్ ఎంపీలు రామసహాయం రఘురామిరెడ్డి, సురేష్ షెట్కార్,

ముఖ్యమంత్రి కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి, ఢిల్లీలో తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్ గౌరవ్ ఉప్పల్ ఉన్నారు.

# వైభవంగా మహంకాళి బోనాలు

హైదరాబాద్: సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి బోనాలు వైభవంగా సాగుతున్నాయి. ఆదివారం అమ్మవారికి సిఎం రేవంత్ రెడ్డి పట్టువస్త్రాలు సమర్పించాలి. అలాగే సిఎస్ శాంతికుమారి బోనం సమర్పించారు. ఇకపోతే సోమవారం తెల్లవారుజాము నుంచే అమ్మవారి ఆలయానికి భక్తులు అధిక సంఖ్య లో తరలివచ్చారు. బోనం, వడి బియ్యం, చీర సారెలతో అమ్మవారికి మొక్కులు సమర్పించుకున్నారు. బోనాల సందర్భంగా రంగం భవిష్యవాణి కార్యక్రమం జరిగింది. రెండోరోజు సోవారం తెల్లవారుజాము నుంచే ఆలయానికి భక్తులు క్యూ కట్టారు. వడి బియ్యం, చీర సారెలతో భక్తులు అమ్మవారికి మొక్కులు సమర్పించుకున్నారు. పచ్చి కుండపై నిలబడి మాతంగి స్వర్ణలత భవిష్యవాణి వినిపించారు. 'నాకు సంతోషంగా ఉంది. నాకు కావాల్సిన పూజలన్నీ అందిస్తున్నారు. బాలికలు, యువతులు, మహిళలు ఇలా ఎవరు బోనం సమర్పించినా స్వీకరిస్తా. పంటలు బాగా పండుతాయి. వర్షాలు సమృద్ధిగా కురుస్తాయి. కోరినన్ని వర్షాలు కురుస్తున్నాయి. నన్ను చూడాలంటే 48 గంటలు కష్టం అంటున్నారు. ఆమాత్రం కష్టపడలేరా?. ఏమి తెచ్చినా ఆనందంగా తీసుకుంటా. ఎలాంటి వ్యాధులు రాకుండా కాపాడుతా. ప్రజలను చల్లగా కాపాడుకుంటా. ప్రజలందరినీ కంటికి రెప్పలా కాపాడుకుంటా. నా రూపాన్ని పెట్టండి. నారూపాన్ని తప్పకుండా పెట్టించుకుంటా, నిలబెట్టుకుంటా. నా గ్రామ ప్రజలందరూ చల్లని సాగపడుతున్నారు.. అంటూ స్వర్ణలత భవిష్యవాణిలో తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్, సీఎస్ శాంతి కుమారి, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. కాగా, రంగం నేపథ్యంలో మహంకాళి అమ్మవారి దర్శనాలను అధికారులు నిలిపివేశారు. అంతకుముందు అంబారీ ఊరేగింపు అందరినీ ఆకట్టుకున్నది. సాయంత్రం 7 గంటలకు ఫలహారం బండ్ల ఊరేగింపుతో బోనాల జాతర ముగియనుంది.

# నూతన న్యాయ చట్టాలపై మీ వైఖరేంటి

## ప్రభుత్వానికి బిఆర్ఎస్ నేత కెటిఆర్ లేఖ

**హైదరాబాద్:** దేశంలో అమలులోకి వచ్చిన నూతన న్యాయ చట్టాలపైన రాష్ట్ర ప్రభుత్వం తన వైఖరి వెల్లడించాలి అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వానికి కేటీఆర్ బహిరంగ లేఖ రాశారు. వివిధ వర్గాల నుంచి కొత్త న్యాయ చట్టాలపై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. ఈ చట్టాలలో ఉన్న పలు నిబంధనలు, సెక్షన్లు ప్రజల ప్రాథమిక హక్కులకు విఘాతం కలిగించేలా, వ్యక్తి స్వేచ్ఛను హరించేలా ఉన్నాయి. నూతన చట్టాల్లో పేర్కొన్న అనేక సెక్షన్ల వల్ల రాష్ట్రంలో పోలీస్ రాజ్యాన్ని తీసుకువచ్చే ప్రమాదం ఉన్నదని కేటీఆర్ పేర్కొన్నారు.



ఇప్పటికే పశ్చిమ బెంగాల్, తమిళనాడు, కర్నాటక ముఖ్యమంత్రులు ఈ చట్టాల అమలును వ్యతిరేకిస్తు న్నారు. నూతన చట్టాలపైన విస్తృతంగా చర్చ జరగాల్సిన అవసరం ఉన్న నేపథ్యంలో వీటిపైన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంతోపాటు, ఇక్కడి కాంగ్రెస్ పార్టీ తన వైఖరిని వెల్లడించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.ప్రజా ఉద్యమాలకు దశాబ్దాలుగా కేరాఫ్ అడ్రస్‌గా ఉన్న తెలంగాణ గడ్డపైన నిరంకుశ, నియంతృత్వ నూతన క్రిమినల్ చట్టాలను ఇక్కడ యధాతథంగా అమలు చేయడమే రాష్ట్ర సర్కారు లక్ష్యమా? లేక తమిళనాడు, కర్నాటక, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల మాదిరిగా సవరణలు తీసుకొస్తారా అనే విషయాన్ని ఈ అసెంబ్లీ సమావేశాల్లో స్పష్టం చేయాలి. ఇప్పటికైనా రేవంత్ సర్కారు వెంటనే తన నిర్ణయాన్ని ప్రకటించాలి. నూతన చట్టాల్లో ఉన్న నియంతృత్వ పూరిత సెక్షన్లను సవరించాలని కేంద్ర ప్రభుత్వానికి వెంటనే లేఖ రాయాలి. దీంతో పాటు ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లో రాష్ట్రం తరపున ఒక తీర్మానాన్ని కేంద్రానికి పంపించాలి. లేకుంటే ఈ ప్రభుత్వాన్ని ప్రజలు నిరంకుశ ప్రజా వ్యతిరేక ప్రభుత్వంగా పరిగణిస్తారని గుర్తుంచుకోవాలి అని కేటీఆర్ సూచించారు.

# సభలో విపక్షాలు సమయాన్ని వృధా చేస్తున్నాయ్

న్యూఢిల్లీ: కేంద్రంలో మూడోసారి అధికారం చేపట్టిన తరువాత ఎన్డీయే సర్కార్ తొలి బడ్జెట్‌ను మంగళవారం ప్రవేశపెట్టబోతోంది. ఈ సందర్భంగా ప్రధాని మోదీ మీడియాతో మాట్లాడారు. పార్లమెంటు విలువైన సమయాన్ని ప్రతిపక్షాలు వృథా చేస్తున్నాయని ఆయన విమర్శించారు.'నేను

బరువెక్కిన హృదయంతో చెబుతున్నా... కొందరు ఎంపీలు, ఇతరులను తమ నియోజకవర్గ సమస్యలపై సభలో మాట్లాడే సమయం ఇవ్వకుండా చేస్తున్నారు. రాజకీయ విభేదాలను పక్కనబెట్టి నిర్మాణాత్మక చర్చల్లో పాల్గొనాలి. సభలో నిరసనలు చేయడమే పనిగా పెట్టుకున్నారు. ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాన్ని రాజ్యాంగ విరుద్ధంగా నిశ్శబ్దం చేసేందుకు ప్రయత్నించారని మోదీ అన్నారు. ఇదివరకు జరిగిన సభల్లో రెండున్నర గంటలు నాపై ప్రతిపక్షాలు నోటికొచ్చినట్లు మాట్లాడాయి. ప్రజాస్వామ్య సంప్రదాయాల్లో ఇలాంటి వ్యాఖ్యలకు తావుండదు. వీటన్నింటినీ దేశం నిశితంగా పరిశీలిస్తోంది. విపక్షాలు నిర్మాణాత్మక సలహాలు ఇవ్వాలి. కనీసం ఈ సమావేశాలైనా సజావుగా సాగుతాయని ఆశిస్తున్నా. 2014 తర్వాత కొంతమంది ఎంపీలు ఒకసారి, మరికొందరు రెండోసారి గెలిచారని అన్నారు. కానీ.. విపక్షాల అరుపుల మధ్య వారిలో చాలా మంది వారి సమస్యలను సభాసాక్షిగా వినిపించలేకపోయారు. ఇక నుంచైనా సమావేశాలను సజావుగా సాగనిస్తూ.. ప్రజల ఆకాంక్షలను సభలో వినిపించనివ్వండి. 60 సంవత్సరాల తరువాత వరుసగా మూడు సార్లు ఓ పార్టీ అధికారంలోకి రావడం ఇదే తొలిసారి.

# నీట్ అవకతవలకపై సుప్రీంలో విచారణ

**న్యూఢిల్లీ:** నీట్–యూజీ 2024 పరీక్ష పత్రం లీకేజీ, అవకతవకలపై దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టు సోమవారం మరోసారి విచారణ జరిపింది. ఈ సందర్భంగా నీట్– యూజీ పరీక్షలో వచ్చిన ఓ ప్రశ్న విషయంలో తీవ్ర చర్చ జరిగింది. ఒకే ప్రశ్నకు రెండు సరైన సమాధానాలు ఇచ్చారని, మార్కులు మాత్రం ఒక్కదానికే వేశారంటూ పిటిషనర్లు వాదించారు. దానికి మార్కులు ఇచ్చినా, ఇవ్వకపోయినా మెరిట్ లిస్టు మారే అవకాశం ఉందని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. పిటిషనర్ల విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకున్న సుప్రీం ధర్మాసనం.. సదరు ప్రశ్నకు సరైన సమాధానం కోసం సంబంధిత సబ్జెక్టుకు చెందిన ముగ్గురు నిపుణులను ఏర్పాటు చేసి, మంగళవారం మధ్యాహ్నం 12 గంటలలోపు దానిపై సమాధానం సమర్పించాలని ఐఐటీ– ఢిల్లీ డైరెక్టర్‌ను ఆదేశించింది. తదుపరి విచారణ మంగళవారానికి వాయిదా వేసింది. అంతకుముందు ఇదే అంశంపై వాదనలు విన్న సుప్రీం ధర్మాసనం.. మే 4కు ముందే పేపర్ లీక్ అయి ఉండొచ్చని అనుమానం వ్యక్తం చేసింది. బిహార్ పోలీసుల దర్యాప్తు నివేదికను ప్రస్తావిస్తూ.. స్ట్రాంగ్ రూమ్ నుంచే ప్రశ్నపత్రం బయటకు వచ్చిందా? అని ప్రశ్నించింది. ఈసందర్భంగా నిందితులకు




మే4వ తేదీ రాత్రి గుర్తుంచుకోవాలని చెప్పారంటే.. లీక్ ఆ తేదీ కంటే ముందే జరిగి ఉండొచ్చని సీజేఐ డీవై చంద్రచూడ్ అనుమానం వ్యక్తంచేశారు. అలా అయితే.. స్ట్రాంగ్ రూమ్ వాలెట్‌లో ప్రశ్నపత్రం బయటకు వచ్చిందా.. అని ప్రశ్నించారు. బిహార్ పోలీసుల దర్యాప్తు రిపోర్టును ఉటంకిస్తూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. అంతకు ముందు పిటిషనర్ల పక్షాన వాదిస్తున్న న్యాయవాది నరేందర్ హుడా తన వాదనలు వినిపిస్తూ..161 వాంగ్మూలాలు పేపర్ లీక్ మే 4వ తేదీ కంటే ముందే చోటుచేసుకొందని బలంగా చెబుతున్నట్లు పేర్కొన్నారు. బిహార్ పోలీసుల రిపోర్టు ప్రకారం సంబంధిత బ్యాంకుల్లో ప్రశ్నపత్రాలను డిపాజిట్ చేయటానికి ముందే లీకైందని పేర్కొన్నారు. మే 3వ తేదీ లేదా అంతకంటే ముందే పేపర్ బయటకు వెళ్లిండొచ్చని పేర్కొన్నారు. ఇదేదో 5–10 మంది విద్యార్థుల కోసం చేసిన లీకేజీ కాదని హుడా కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. కచ్చితంగా ఓ గ్యాంగ్ ఎప్పటినుంచో ఈ పని చేస్తోందని పేర్కొన్నారు. సంజీవ్ ముఖియా, ఇతర కీలక నిందితులు అరెస్టు కాలేదనే విషయాన్ని గుర్తు చేశారు. ఒకచోట ప్రశ్నపత్రాన్ని రిక్షాలో కూడా తరలించారని ఆయన న్యాయస్థానం దృష్టికి తీసుకొచ్చారు. ప్రస్తుతం కోర్టులో వాదనలు జరుగుతున్నాయి.

నీట్–యూజీ 2024కు సంబంధించి దాఖలైన పిటిషన్లపై సోమవారం నుంచి సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్, జస్టిస్ జె.బి.పార్దీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్ర ధర్మాసనం

విచారిస్తోంది. ఇందులో నీట్‌కు సంబంధించిన 40 పిటిషన్లు ఉన్నాయి. వీటిల్లో వివిధ రాష్ట్రాల్లోని హైకోర్టుల్లో

దాఖలైన పిటిషన్లు అన్నింటిని సుప్రీంకోర్టుకు బదిలీ చేయాలన్న ఎన్‌టీఏ అభ్యర్థన కూడా ఉంది.



# భారీ వర్షాలకు దుబాయ్ అతలాకుతలం..

పపంచంలో చోటుచేసుకుంటున్న వాతావరణ మార్పులకు అద్దం పట్టే సంఘటన ఇది. ఎటుచూసినా ఇసుక దిబ్బలు.. తవ్వితే ఆయిల్ బావులు తప్పా.. నీరు మాత్రం కనిపించని ఎడాది దేశం దుబాయ్. అలాంటి దేశంలో వరదలు వచ్చాయంటే విస్తుగొలిపే అంశమే. తాజాగా, దుబాయ్‌లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురుస్తున్నాయి. దీంతో పలు చోట్ల రోడ్లపై నీరు నిలిచి, జనజీవనం స్తంభించిపోయింది. విమానాలు కూడా ఆలస్యంగా బయలుదేరాయి. కొన్నింటిని దారి మళ్లించామని అధికారులు తెలిపారు.

చుక్క నీరు కోసం అల్లాడిపోయే ఏడారి దేశం దుబాయ్‌లో భారీ వర్షాలు ముంచెత్తుతున్నాయి. వర్షపు చినుకు కోసం ఏళ్లకు ఏళ్లు ఎదురుచూసే అరబ్ దేశంలో శనివారం నుంచి వర్షాలు విస్తారంగా కురుస్తున్నాయి. దీంతో రోడ్లు, ఖాళీ ప్రదేశాలు చెరువులను తలపిస్తున్నాయి. భారీ వర్షాలకు జనజీవనం స్తంభించింది. ప్రపంచంలోనే అత్యంత రద్దీగా ఉండే దుబాయ్ ఎయిర్‌పోర్ట్‌లో పలు విమాన సర్వీసులు రద్దయ్యాయి. పలు విమానాలను దారి మళ్లించగా.. మరికొన్ని ఆలస్యంగా బయలుదేరాయి. మొత్తం 13 విమానాలను దారి మళ్లించినట్టు దుబాయ్ ఎయిర్‌పోర్ట్ వర్గాలు తెలిపాయి. శనివారం తెల్లవారుజాము నుంచి కురిసిన వర్షానికి విమాన రాకపోకలకు అంతరాయం ఏర్పడినట్టు పేర్కొన్నాయి.

మరోవైపు, దుబాయ్ సగటు వర్షపాతం 120 మిల్లీమీటర్ల కాగా.. కేవలం ఆరు గంటల్లోనే 50 మిల్లీమీటర్ల వర్షపాతం కురిసింది. ఉరుములు, మెరుపులతో కురిసి వర్షానికి ఎక్కడిక్కడ చెట్లు విరిగిపడ్డాయి. దీంతో స్పందించిన అధికారులు.. హుటాహుటిన సిబ్బందిని రంగంలోకి దింపారు. విరిగిపోయిన చెట్లను తొలగించి, డ్రెయినేజీలను ఖాళీచేయించారు. భారీ వర్షానికి ప్రధాన జాతీయ రహదారిపై వాహనాలు నిలిచిపోయి.. ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. మరోవైపు, ఆదివారం కూడా పిడుగులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు.

అరేబియా ద్వీపకల్ప దేశంలో వర్షం అసాధారణంగా ఉంటుంది, కానీ శీతాకాలంలో క్రమానుగతంగా సంభవిస్తుంది.

# ప్రజాచైతన్య సాహిత్య కుసుమం దాశరథి.

- “సత్యశోధక్” ప్రిన్సిపాల్ రావుట్ల నర్సయ్య.



**వేగుచుక్క న్యూస్, సిరికొండ, జులై 22:**

నిజాం నిరంకుశ పాలనను తన రచనలతో యావత్ తెలంగాణ ప్రజానికాన్ని చైతన్య పరిచిన సాహిత్యకుసుమం దాశరథి కృష్ణమాచార్య అని సత్యశోధక్ పాఠశాల ప్రిన్సిపాల్ రావుట్ల నర్సయ్య అన్నారు. తెలంగాణ తొలిదశ ఉద్యమకారుడు రచయిత, కవి, వాగ్గేయకారుడు దాశరథి కృష్ణమాచార్యుల 99వ జయంతిని సత్యశోధక్ పాఠశాలలో సోమవారం ఘనంగా నిర్వహించారు. మొదటగా ప్రిన్సిపాల్ ఆర్. నర్సయ్య కృష్ణమాచర్య చిత్రపటానికి పూలమాలనలంకరించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నర్సయ్య మాట్లాడుతూ, పోరాటాల ఖిల్లా కాకతీయులు ఏలిన నాటి ఓరుగల్లు నేటి మహబూబాబాద్ జిల్లాలో జన్మించిన దాశరథి కృష్ణమాచార్య చెరసాలలు సైతం తన గొంతుకను, కలలను ఆపలేవని కారాగారంలో జైలు గోడల లోపల బొగ్గుతో

“ మా నిజాం రాజు తరతరాల బూజు “ అని రాసి నిరసించి, “ఓ నిజాము పిశాచమా కానరాడు నిన్ను బోలిన రాజు మాకెన్నడినీ, తీగలను తెంపి అగ్నిలో దింపినావు నా తెలంగాణ కోటి రతనాల వీణ.. ఎముకల్ మసి చేసి పొలం దున్ని బోషనములన్ నవాబునకు స్వర్ణము నింపినది రైతులదే...” అని నినదించిన ప్రజా కవి అన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధపోరాటం, విముక్తి ఉద్యమంలో నైజాం నవాబునెదిరించి విప్లవ చైతన్య మూర్తియైనాడనీ అన్నారు. భూస్వాములు, దొరలు ఆగడాల ఆటకట్టించాలనీ, రైతుల కోసం పోరాడుతున్న కమ్యూనిస్టులతో కలిసితానొక విప్లవ కార్యకర్తగానే ప్రజలతో మమేకమై గిరిజనగూడేలలో, లంబాడీ తండాలలో, దళితవాడలలో తిరిగి, గ్రామాలలో రైతు, కూలీలను కలిసి ఉద్యమంలో భాగస్వామ్యం అయ్యాడని పేర్కొన్నారు. తన కలం, గళం ప్రజలకొరకే అంకితం చేసిన మహనీయుడు దాశరథి అని అన్నారు. దాశరథి రాసిన దీశాలి, అగ్నిధార, రుద్రవీణ ఆణిముత్యాల్లాంటి రచనలని, తెలంగాణ మలిదశ ఉద్యమంలో సైతం చైతన్య ప్రతీకలుగా నిలిచాయన్నారు. స్వరాష్ట్ర ఉజ్వల ప్రగతికి ప్రతి పౌరుడు భాధ్యతాయుతంగా తన వంతు కర్తవ్యాన్ని నిర్వర్తించి అమరవీరుల కలలు సాకారం అవ్వడంలో భాగస్వాములు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఈ కార్లపై రూ.85 వేల తగ్గింపు.. ఆఫర్ కొద్దిరోజులే!

కొత్త కారు కొనుగోలు చేయాలనుకుంటున్న వారికి బంపర్ ఆఫర్. దేశీయ దిగ్గజ ఆటోమొబైల్ కంపెనీ టాటా మోటార్స్ ఈ మార్చి నెలలో అదిరే ఆఫర్లు తీసుకొచ్చింది. వివిధ మోడళ్లపై గరిష్ఠంగా రూ.85 వేల వరకు తగ్గింపు అందిస్తోంది. ఓసారీ ఈ డిస్కౌంట్ ఆఫర్ల లిస్ట్ పరిశీలిద్దాం.

మీరు కొత్త కారు కొనాలనుకుంటున్నారా? అయితే, ఇది మీకోసమే. దేశీయ దిగ్గజ సంస్థ, టాటా గ్రూప్ అనుబంధ సంస్థ టాటా మోటార్స్ సూపర్ డీల్ తీసుకొచ్చింది. తమ పోర్ట్‌ఫోలియోలోని వివిధ మోడళ్లపై భారీ డిస్కౌంట్ ఆఫర్స్ ప్రకటించింది. గరిష్ఠంగా రూ.85 వేల వరకు డిస్కౌంట్లు కల్పిస్తోంది. అయితే, ఈ తగ్గింపు ఆఫర్ మార్చి నెలాఖరు వరకే ఉంటుందని కస్టమర్లు గుర్తుంచుకోవాలి. అలాగే ఈ డిస్కౌంట్ ఆఫర్ అనేది డీలర్‌షిప్, ప్రాంతాన్ని బట్టి మారుతుంది. ప్రస్తుతం టాటా మోటార్స్ కి చెందిన వివిధ మోడళల్లో ఏ కారుపై ఎంత డిస్కౌంట్ పొందవచ్చు అనేది జాబితా పరిశీలిద్దాం.

టాటా టియాగో పెట్రోల్ ఎంటీ కారుపై రూ.70 వేల వరకు తగ్గింపు పొందవచ్చు. ఇందులో నేరుగా క్యాష్ డిస్కౌంట్ రూ.45 వేలు వస్తుంది. అలాగే ఎక్స్చేంజ్ బోనస్ లేదా స్క్రాపేజీ బోనస్ రూ.15 వేలు పొందవచ్చు. దీంతో పాటు రూ.10 వేల కార్పొరేట్ బోనస్ లభిస్తుంది.

టాటా టియాగో పెట్రోల్ ఏఎంటీ కారుపై రూ.60 వేలు తగ్గింపు వస్తోంది. ఇందులో క్యాష్ డిస్కౌంట్ రూ.35 వేలు ఉండగా ఎక్స్చేంజ్ బోనస్ రూ.15 వేలు, కార్పొరేట్ డిస్కౌంట్ రూ.10 వేలు లభిస్తోంది.

టాటా టియాగో సీఎన్‌జీ, టాటా టిగోర్ పెట్రోల్, టాటా





టిగోర్ సీఎన్‌జీ.. ఈ మూడు కార్లపై గరిష్ఠంగా రూ.75 వేల వరకు డిస్కౌంట్ అందిస్తోంది. ఇందులో రూ. 50 వేల క్యాష్ డిస్కౌంట్ వస్తుండగా.. ఎక్స్చేంజీ బోనస్ రూ.15 వేలు, కార్పొరేట్ డిస్కౌంట్ రూ.10 వేలు లభిస్తుంది. టాటా నెక్సాన్ పెట్రోల్ ఎంటీ వేరియంట్ పై రూ.68 వేల తగ్గింపు లభిస్తోంది. ఇందులో క్యాష్ డిస్కౌంట్ రూ. 40 వేలు ఉండగా.. ఎక్స్చేంజీ బోనస్ రూ. 20 వేలు ఉంది. కార్పొరేట్ బోనస్ రూ. 8 వేలు లభిస్తుంది. టాటా హారియర్ ఎంటీ, టాటా సఫారీ ఎంటీ కార్లపై గరిష్ఠంగా రూ.85 వేల తగ్గింపు అందిస్తోంది. ఇందులో క్యాష్ డిస్కౌంట్ రూ.50 వేలు లభిస్తుండగా.. ఎక్స్చేంజీ బోనస్ రూ.25 వేలు, కార్పొరేట్ బోనస్ రూ. 10 వేలు లభిస్తుంది. టాటా ఆల్ట్రోజ్ డీజిల్ కారుపై రూ. 55 వేల తగ్గింపు అందిస్తోంది. ఇందులో రూ.30 వేల క్యాష్ డిస్కౌంట్, రూ.10 వేల ఎక్స్చేంజీ బోనస్, రూ. 15 వేల కార్పొరేట్ డిస్కౌంట్ లభిస్తున్నాయి.

టాటా న్యూహారియర్, టాటా న్యూ సఫారీలపై రూ.50 వేల తగ్గింపు కల్పిస్తోంది. ఇందులో రూ.40 వేల క్యాష్ డిస్కౌంట్, రూ.10 వేల కార్పొరేట్ డిస్కౌంట్ కల్పిస్తోంది. నెక్సాన్ పెట్రోల్ ఏఎంటీ కారుపై రూ.48 వేల తగ్గింపు ఇస్తోంది. ఇందులో రూ. 20 వేల క్యాష్ డిస్కౌంట్ వస్తుండగా.. రూ. 20 వేల ఎక్స్చేంజీ బోనస్ తో పాటు రూ.8 వేల కార్పొరేట్ డిస్కౌంట్ లభిస్తోంది.

న్యూ నెక్సాన్ పెట్రోల్, న్యూ నెక్సాన్ డీజిల్, కార్లపై రూ.38 వేల వరకు తగ్గింపు ఇస్తోంది. ఇందులో రూ.30 వేలు నేరుగా క్యాష్ డిస్కౌంట్ అందుతోంది.

# ఏడాదిలో లక్షకు రూ.2.5 లక్షలు.. ఒక్కో షేరుకు రూ.6 డివిడెంట్!

ఇండస్ట్రియల్ సెక్టార్ మల్టీబ్యాగర్ స్టాక్ ఏడాదిలోనే 148 శాతం మేర పెరిగి ఇన్వెస్టర్లకు కాసులు కురిపించింది. లక్ష పెట్టిన వారికి రూ.2.5 లక్షలు అందించింది. ఇప్పుడు ఒక్కో షేరుకు రూ.6 చొప్పున డివిడెంట్ అందిస్తోంది. ఆ స్టాక్ గురించి ఇప్పుడు మనం తెలుసుకుందాం. స్మాల్ క్యాప్ కేటగిరికి చెందిన ఆక్సెల్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ తమ షేర్ హోల్డర్లకు అదిరే శుభవార్త అందించింది. శనివారం జరిగిన కంపెనీ బోర్డు ఆఫ్ డైరెక్టర్స్ సమావేశంలో 2024 ఆర్థిక ఏడాది మూడో త్రైమాసికానికి గాను ఒక్కో ఈక్విటీ షేరుకు రూ. 6 చొప్పున మధ్యంతర డివిడెంట్ చెల్లింపుకు ఆమోదం తెలిపింది. మరోవైపు ఈ కంపెనీ షేరు గత ఏడాది కాలంలోనే 148 శాతం లాభాన్ని తమ వాటాదారులకు అందించింది. లక్ష పెట్టిన వారికి రూ.2.5 లక్షలు అందించి మల్టీబ్యాగర్ స్టాక్ గా నిలిచింది.

కంపెనీ స్టాక్ ఎక్స్చేంజ్ ఫైలింగ్ ప్రకారం.. మార్చి 9వ తేదీన జరిగిన కంపెనీ బోర్డు ఆఫ్ డైరెక్టర్స్ సమావేశంలో 2024 ఆర్థిక ఏడాది డిసెంబర్ 31తో ముగిసిన మూడో త్రైమాసికానికి గాను రూ. 10 ముఖ విలువ కలిగిన ఒక్కో ఈక్విటీ షేరుకు రూ. 6 మధ్యంతర డివిడెండ్ సిఫార్స్ చేసినట్లు కంపెనీ వెల్లడించింది. ఈ మధ్యంతర డివిడెండ్ అందించేందుకు మార్చి 20, 2024 ని రికార్డు తేదీగా కంపెనీ నిర్ణయించినట్లు ఎక్స్చేంజ్ ఫైలింగ్ లో తెలిపింది. ఇక సెప్టెంబర్ 17, 2018 నుంచి ఇప్పటి వరకు ఈ కంపెనీ 7 సార్లు డివిడెండ్ అందించింది.



గత గురువారం ట్రేడింగ్ సెషన్ లో ఆక్సెల్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ షేరు సుమారు 1.77 శాతం లాభపడి రూ. 589 వద్ద స్థిరపడింది. ఈ షేరు 52 వారాల గరిష్ఠ ధర రూ. 850.30 వద్ద ఉంది. అలాగే 52 వారాల కనిష్ఠ ధర రూ. 230.60 వద్ద ఉంది. గత ఒక వారంలో చూసుకుంటే ఈ షేరు సుమారు 6 శాతం నష్టాన్ని చవిచూసింది.

# 14 వేల అడుగుల ఎత్తులో విమానం..

విమానం అంటే వేలాది అడుగుల ఎత్తులో మెరుపు వేగంతో ప్రయాణిస్తుంది. అలాంటి విమానానికి సంబంధించి అన్నీ సక్రమంగా ఉండాలి. అందుకే విమానాలను తనిఖీ చేసిన తర్వాతే ప్రయాణానికి అనుమతినిస్తారు. అయితే తాజాగా ఓ విమానంలో జరిగిన సంఘటన గురించి వింటే మాత్రం గుండె ఝల్లుమంటుంది. ఎందుకంటే గాల్లోకి ఎగిరిన తర్వాత దాని రెండు కిటికీలు ధ్వంసమైనట్లు గుర్తించారు.

14 వేల అడుగుల ఎత్తులో విమానం రెండు కిటికీలు ధ్వంసమైనట్లు గుర్తింపు గాల్లోకి ఎగిరిన కొద్దిసేపటికే గుర్తించిన ప్రయాణికులు ఇటీవల విమానాల్లో చోటు చేసుకుంటున్న భద్రతా పరమైన లోపాలు తీవ్ర దుమారానికి కారణం అవుతున్నాయి. విమానాల్లో జరిగిన సంఘటనలు కొన్ని అయితే సాంకేతిక లోపాలు తలెత్తిన సందర్భాలు కూడా పెరగడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. అయితే ఇది కొన్నిసార్లు ఆయా ఎయిర్‌లైన్స్ అజాగ్రత్త, మరికొన్నిసార్లు యాధృచ్ఛికంగా జరుగుతున్నాయి. ఈ క్రమంలోనే తాజాగా జరిగిన ఘటన తీవ్ర భయందోళన కలిగిస్తోంది. ఎందుకంటే వేల అడుగుల ఎత్తులో ఉన్న ఓ విమానంలోని కిటికీలు దెబ్బతిన్నాయి. అయితే గాల్లో ఉండగా ఈ విషయాన్ని ప్రయాణికులు గుర్తించి ఎయిర్‌లైన్స్ సిబ్బందికి తెలియజేశారు. దీంతో అందులో ఉన్న ప్రయాణికులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బిక్కుబిక్కుమంటూ గడిపారు. లండన్‌లోని స్టాన్స్టెడ్ ఎయిర్‌పోర్ట్ నుంచి ఫ్లోరిడా ఇంటర్నేషనల్





ఎయిర్‌పోర్టుకు బయల్దేరిన ఓ విమానంలో ఈ సంఘటన చోటు చేసుకుంది. విమానం గాలిలో ఉండగా రెండు కిటికీలు ధ్వంసం అయినట్లు అందులోని ప్రయాణికులు గుర్తించారు. దీంతో వెంటనే సిబ్బందిని అప్రమత్తం చేయడంతో ఆ విమానాన్ని వెనక్కి మళ్లించారు. ఎయిర్‌బస్ ఏ-321 జెట్‌లో ఈ ఘటన చోటు చేసుకుంది. ఆ విమానం 14500 అడుగుల ఎత్తులో ప్రయాణిస్తుండగా.. అందులోని రెండు విండోలకు చెందిన ఇన్నర్, ఔటర్ పేన్స్, రబ్బర్ సీల్స్ లేవనే విషయాన్ని ప్రయాణికులు గుర్తించారు. అయితే ఘటన జరిగిన సమయంలో అందులో 11 మంది ఎయిర్‌లైన్స్ సిబ్బంది, 9 మంది ప్రయాణికులు ఉన్నట్లు తెలుస్తోంది.

అమెరికాకు చెందిన లగ్జరీ హాలీడే కంపెనీ అయిన టీసీఎస్ వరల్డ్ ట్రావెల్ వినియోగిస్తుండగా దాన్ని టైటాన్ ఎయిర్‌వేస్ ఆపరేట్ చేస్తోంది. ఎయిర్ యాక్సిడెంట్స్ ఇన్వెస్టిగేషన్ బ్రాంచ్ విచారణ జరపడంతో ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. విమానం టేకాఫ్ అయిన తర్వాత అందులో ఉన్న ఒక ప్రయాణికుడు గుర్తించి విమాన సిబ్బందికి చెప్పారు. అందులో ఒక కిటికీ చుట్టూ ఉన్న రబ్బర్ సీల్ ఊడిపోయి వేలాడుతూ కనిపించి ంది. దీంతో ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. అయితే ఆ విమానాన్ని ఈ ప్రయాణానికి ముందు రోజు ఒక సినిమా షూటింగ్ కోసం ఉపయోగించినట్లు తెలుస్తోంది. అయితే సినిమా షూటింగ్‌లో భాగంగా శక్తివంతమైన లైట్లు ఉపయోగించడం వల్ల విండోలు దెబ్బతిని ఉండవచ్చని ఎయిర్ యాక్సిడెంట్స్ ఇన్వెస్టిగేషన్ బ్రాంచ్ అనుమానం వ్యక్తం చేసింది. అయితే లైట్లకు, విమానం కిటికీలకు మధ్య దూరం కనీసం 10 మీటర్లు ఉండాలని.. అయితే సినిమా షూటింగ్ సమయంలో కేవలం 6 మీటర్ల నుంచి 9 మీటర్లే ఉంచారని ఏఏఐబీ గుర్తించింది. దీంతో ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకున్న ఏఏఐబీ మరింత లోతైన దర్యాప్తు చేస్తోంది.

# వారిని అంతం చేయాలని పిలుపు!



ప్రస్తుతం జరుగుతున్న ఇజ్రాయెల్ హమాస్ యుద్ధంపై టెస్లా, ట్విటర్ సంస్థల అధినేత ఎలాన్ మస్క్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇజ్రాయెల్ బలగాలు హమాస్ ఉగ్రవాదులను పూర్తిగా మట్టుబెట్టాలని సూచించారు. లేకపోతే వారు మళ్లీ ఇజ్రాయెల్‌పై దాడులు చేసే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఇజ్రాయెల్‌పై దాడి చేసి హమాస్ ఉగ్రవాదులు తమ అంతాన్ని తామే కొని తెచ్చుకున్నారు. ఈ క్రమంలోనే తమపై చేసిన దాడికి ఇజ్రాయెల్ దీటుగా ప్రతీకార దాడులకు దిగుతోంది. దీంతో గాజా ప్రాంతంలో రక్తపాతం కనిపిస్తోంది. ఈ యుద్ధంపై ప్రపంచ దేశాలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. అయితే ఇజ్రాయెల్ హమాస్ మధ్య జరుగుతున్న యుద్ధంపై ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ స్పందించారు. ప్రస్తుతం గాజాలో గ్రౌండ్ ఆపరేషన్ నిర్వహించిన ఇజ్రాయెల్ బలగాలు.. హమాస్ ఉగ్రవాదులను ఏరిపారేయాలని.. అసలు ఆ సంస్థనే నామరూపాల్లేకుండా చేయాలని పిలుపునిచ్చారు. ఇప్పుడు వారిని అంతం చేయకపోతే.. హమాస్ ఉగ్రవాదులు మళ్లీ మళ్లీ ఇజ్రాయెల్‌పై దాడులకు పాల్పడుతారని హెచ్చరికలు జారీ చేశారు.

మరోవైపు.. హమాస్ నెట్‌వర్క్‌ను అంతం చేసేదాకా వదలమని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ఇప్పటికే పలుమార్లు హెచ్చరించారు. ఈ క్రమంలోనే గాజా స్ట్రిప్‌లో ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్స్ భీకర దాడులు చేస్తోంది. ఈ నేపథ్యంలోనే ఎలాన్ మస్క్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. హమాస్ మిలిటెంట్లను ఇజ్రాయెల్ బలగాలు పూర్తిగా హతమార్చడం లేదా ఖైదీలుగా చేయాలని ఎలాన్ మస్క్ అభిప్రాయపడ్డారు. అమెరికన్ పాడ్‌కాస్ట్ షో అయిన లెక్స్ ఫ్రిడ్‌మన్‌లో మాట్లాడిన మస్క్ శు క్రవారం ఈ వ్యాఖ్యలు చేశారు. అయితే ఇది పూర్తిగా తన వ్యక్తిగత అభిప్రాయమని ఎలాన్ మస్క్ స్పష్టం చేశారు. హమాస్ ఉగ్రవాదులను చంపకుంటే వాళ్లు మళ్లీ తిరిగి ఇజ్రాయెల్‌పై దాడులు చేస్తూనే ఉంటారని పేర్కొన్నారు. పశ్చిమాసియాలో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితుల కారణంగా ఇజ్రాయెల్ - హమాస్ యుద్ధంపై తలెత్తున్న ప్రశ్నలకు సమాధానాలు దొరకడం లేదని పేర్కొన్నారు. ఇజ్రాయెల్‌పై ఆకస్మికంగా దాడులు చేసిన హమాస్ ఉగ్రవాదులు.. ఇజ్రాయెల్ విజయం సాధిస్తుందని కనీసం ఊహించలేకపోయిందని ఎద్దేవా చేశారు. ప్రపంచవ్యాప్తంగా మద్దతు కూడగట్టుకునేందుకే ఇజ్రాయెల్‌పై హమాస్ ఉగ్రవాదులు తీవ్రమైన దారుణాలకు పాల్పడ్డారని ఆరోపించారు. అయితే తాము చేసిన దాడులకు ఇజ్రాయెల్ ఈ స్థాయిలో విరుచుకుపడుతుందని హమాస్ ఉగ్రవాదులు ఊహించలేకపోవచ్చని ఎలాన్ మస్క్ తెలిపారు. ఈ సందర్భంగానే యుద్ధంలో ఇజ్రాయెల్ కొంత జాలి, దయతో వ్యవహరించాలని ఎలాన్ మస్క్ అభిప్రాయం వ్యక్తం చేశారు. గాజాలో గాయపడిన వారికి చికిత్స అందించేందుకు మానవతా సాయం కింద మొబైల్ ఆస్పత్రులు ఏర్పాటు చేయాలని ఎలాన్ మస్క్ సూచించారు. మరోవైపు ప్రజలు సురక్షిత ప్రాంతాలకు వెళ్లేందుకు మానవతా కారిడార్లకు ఇజ్రాయెల్ అనుమతించింది. బందీల విడుదలకు ఉత్తర గాజాలో జరుపుతున్న యుద్ధానికి రోజుకు 4 గంటలు విరామం ఇవ్వడానికి ఇజ్రాయెల్ అంగీకరించింది. అయితే కాల్పుల విరమణకు మాత్రం అంగీకరించడం లేదు. ఇజ్రాయెల్ దాడుల్లో గాజాలో ఇప్పటి వరకు 10 వేల మందికి పైగా ప్రాణాలు కోల్పోయారని గాజా ఆరోగ్య మంత్రిత్వశాఖ తాజాగా వెల్లడించింది.


# కల్తీ మద్యం కాటుకు 19 మంది

లి.. నిందితుల్లో రాజకీయ నేతలు!

కల్తీ మద్యం తాగి ప్రాణాలు పోయిన సంఘటనలు మనం ఎన్నో చూస్తూనే ఉన్నాం. తాజాగా ఇలాంటి కల్తీ మద్యం కాటుకు 19 మంది అమాయకులు ప్రాణాలు కోల్పోయారు. అయితే ఆ మద్యం సరఫరా చేసిన డీలర్లు వివిధ పార్టీలకు చెందిన నేతలు కావడంతో ఈ ఘటన రాజకీయంగా తీవ్ర ప్రకంపనలు రేపుతోంది. అయితే ఈ ఘటనతో అప్రమత్తమైన పోలీసులు రాష్ట్ర వ్యాప్తంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. హర్యానాలో కల్తీ మద్యం పడగ విప్పింది. ఈ కల్తీ మద్యం తాగి 19 మంది మృతి చెందడం తీవ్ర కలకలం రేపుతోంది. ఈ ఘటనలో ప్రధాన నిందితులుగా గుర్తించి ఏడుగురిని అరెస్ట్ చేశారు. అయితే ఈ నిందితులు వివిధ పార్టీలకు చెందిన నాయకులు కావడంతో రాజకీయంగా తీవ్ర విమర్శలు చెలరేగుతున్నాయి. కల్తీ మద్యంతో అంత మంది చనిపోవడంతో రాష్ట్ర వ్యాప్తంగా అధికారులు సోదాలు నిర్వహించారు. ఈ క్రమంలోనే ఓ నిషేధిత ఫ్యాక్టరీలో తయారు చేస్తున్న 200 మద్యం డబ్బాలను సీజ్ చేశారు. ఆ కల్తీ మద్యం తయారు చేయడానికి వాడిన పదార్థాలను కూడా స్వాధీనం చేసుకున్నారు. ఆ ఏడుగురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కల్తీ మద్యం అంబాలా జిల్లాలోని పలు వైన్ షాపులకు సరఫరా అయినట్లు తెలుస్తోంది. ఆ షాపుల్లో మద్యం కొనుగోలు చేసి తాగిన 19 మంది తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. మందేబరి, పంజెతో కా మజ్రా, పూస్ఘర్, సరన్ గ్రామాలకు చెందిన 19 మంది చనిపోయారు. ఈ క్రమంలోనే వారిని హుటాహుటిన స్థానిక ఆస్పత్రులకు తరలించగా చికిత్స పొందుతూ మరణించారని వైద్యులు తెలిపారు. ఈ కేసులో ఇప్పటివరకు ప్రధాన పాత్రదారులుగా గుర్తించి ఏడుగురిని అరెస్ట్ చేశారు. అందులో ఒక కాంగ్రెస్ నేతతోపాటు జననాయక్ జనతా పార్టీ-జేజేపీ నేత కుమారుడితోపాటు మరో ఐదుగురు వ్యక్తులు ఉన్నారు. ఈ ఘటనపై అధికారంలో ఉన్న మనోహర్ లాల్ ఖట్టర్ ప్రభుత్వంపై ప్రతిపక్షాలు తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డాయి. కల్తీ మద్యాన్ని అరికట్టడంలో హర్యానా సర్కార్ పూర్తి స్థాయిలో విఫలం అయిందని మండిపడ్డాయి. ఈ క్రమంలోనే లిక్కర్



సరఫరా చేసిన డీలర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేశారు. ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన ఇద్దరు కార్మికులు అంబాలా జిల్లాలో గురువారం కల్తీ మద్యం తాగి మరణించారు. ఇక ఈ కల్తీ మద్యం పట్ల చనిపోయిన వారి కుటుంబాల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తం అవుతోంది. రాత్రి మద్యం తాగి తన తండ్రి చనిపోయాడని.. ఓ వ్యక్తి కన్నీరు మున్నీరయ్యాడు. అయితే తన తండ్రి తక్కువ మోతాదులోనే మద్యం సేవిస్తాడని.. కల్తీ మద్యం తాగడం వల్లే తన నాన్న ప్రాణాలు పోయాయని ఆవేదన వ్యక్తం చేశాడు. అయితే గ్రామస్తులు మాత్రం మద్యం వ్యాపారులపై బహిరంగంగా మాట్లాడేందుకు భయపడటం వారి ఆధిపత్యాన్ని తెలియజేస్తోంది. తాము నోరు విప్పితే తమ ప్రాణాలకే ప్రమాదం ఉంటుందని ఒక గ్రామస్థుడు చెప్పడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. ఈ కల్తీ మద్యం తాగి 19 మంది చనిపోయిన ఘటనను తీవ్రంగా పరిగణించిన హర్యానా ప్రభుత్వం.. కేసు విచారణ నిమిత్తం యమునానగర్ పోలీసులు ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) ఏర్పాటు చేశారు.



సమంత సినిమా షూటింగ్స్‌కు ఏడాది బ్రేక్ తీసుకున్న సమంత తిరిగి షూటింగ్స్‌కు హాజరు అయ్యేందుకు రెడీ అవుతోంది సినిమా షూటింగ్స్‌కు ఏడాది బ్రేక్ తీసుకున్న సమంత తిరిగి షూటింగ్స్‌కు హాజరు అయ్యేందుకు రెడీ అవుతోంది. సినిమా షూటింగ్స్ కంటే ముందు సమంత తాను ఇప్పటికే నటించిన సిటాడెల్ వెబ్ సిరీస్ ప్రమోషన్ లో పాల్గొనబోతున్నట్లుగా తెలుస్తోంది. ఇటీవల సిటాడెల్‌కి సంబంధించిన ప్రమోషన్ లో సమంత పాల్గొంది. ఆ సమయంలో సిటాడెల్ షూటింగ్ అనుభవాలను పంచుకుంది. సిటాడెల్ కోసం ప్రత్యేక శిక్షణ తీసుకున్నాను. ఆ సమయంలో నేను చాలా బలహీన స్థితిలో ఉన్నాను. అప్పటికే నేను చాలా వీక్ అయ్యాను. నాలో ఉన్న బలం మయోసైటిస్ వల్ల 50 శాతం కు పడిపోయింది. ఆ యాభై శాతం బలంతోనే సిటాడెల్ కోసం


## సగం బలంతో పోరాడాల్సి వచ్చింది

కఠినమైన శిక్షణ తీసుకున్నట్లుగా సమంత పేర్కొంది. ఇమ్యూనిటీ లేక చాలా ఇబ్బంది పడుతున్న సమయంలో కూడా సిటాడెల్ షూటింగ్ లో పాల్గొన్నట్లుగా సమంత తెలియజేసింది. తన వీక్‌నెస్ ను ఆ సమయంలో బయటకు తెలియకుండా చూసుకున్నట్లుగా పేర్కొంది. గత ఏడాది ఖుషి సినిమా తో తెలుగు ప్రేక్షకుల ముందుకు వచ్చిన సమంత త్వరలో సిటాడెల్ వెబ్ సిరీస్ తో ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ముందు ముందు వరుసగా హిందీ సినిమాల్లో నటించాలని, హిందీ వెబ్ సిరీస్ ల్లో నటించి నటిగా తనను తాను నిరూపించుకునేందుకు ప్రయత్నిస్తున్నట్లు సన్నిహితుల వద్ద సమంత చెప్పినట్లు సమాచారం అందుతోంది.

## పక్కా పర్ఫెక్ట్ ఫ్యామిలీ స్టార్

‘గీత గోవిందం’ తర్వాత మరోసారి విజయ్ దేవరకొండ-పరశురాం ఫ్యామిలీ స్టార్‌తో చేతులు కలిపిన సంగతి తెలిసిందే. ‘గీత గోవిందం’ తర్వాత మరోసారి విజయ్ దేవరకొండ-పరశురాం ఫ్యామిలీ స్టార్ తో చేతులు కలిపిన సంగతి తెలిసిందే. ఆ కలయికతోనే ‘గీత గోవిందం’ కి సీక్వెల్ చేస్తున్నారా? అన్న సందేహాలు తెరపైకి వచ్చాయి.

అందుకు తగ్గట్టు ‘ఫ్యామిలీస్టార్’ అనే టైటిల్ ప్రకటించడంతో కంటెంట్ అలాగే ఉండ బోతుందని దాదాపు ఓ అంచానికి వచ్చేసారంతా. అటుపై రిలీజ్ అయిన టీజర్ ఫస్ట్ లుక్ పోస్టర్స్ తో మరింత ఆధారం దొరికింది. విజయ్ లుంగీ లుక్..వంట గదిలో వ్యవహారాలు..పిసినారి తనం..’గీతగోవిందం’ లో పాత్రల్ని రివర్స్ చేసినా ఇలా కొన్ని హింట్లు పర్ఫెక్ట్ ఫ్యామిలీ స్టార్ లానే అనిపించాయి. తాజాగా ట్రైలర్ తో ఇది పక్కా ఫ్యామిలీ మూవీ అని తేలిపోయింది. ‘గీతగోవిందం’ కి సీక్వెల్ లా అనిపిస్తుంది. మరోసారి విజయ్ ఇమేజ్ ని..లేడీ ఫాలోయింగ్‌ని దృష్టిలో పెట్టుకుని రాసుకున్న కథలా తెలుస్తుంది. హీరోయిన్ హీరో వెంట పడటం... అటుపై హీరో కాదనడం..తప్పు తెలుసుకున్న హీరో విదేశాలు వెళ్లి ఒప్పించడాన్ని పరశురాం తనదైన శైలిలో కామెడీ టచప్‌తో ఆవిష్కరించాడు. సీనియర్ బ్యూటీ అందాల షో అలాగే విజయ్ లో యాక్షన్ స్టార్ ని హైలైట్ చేసాడు. నేనైతే మీకు ఫుల్లుగా పడిపోయా అంటూ మృణాల్ ఠాకూర్ చెప్పిన రొమాంటిక్ డైలాగ్ ఆకట్టుకుంటోంది. బుర్ర బద్దలైపోతుద్ది కొడకా... భయపడాలిరా ఇంకోసారి ఎవరైనా చులకనగా మాట్లాడాలంటే? అంటూ విజయ్ విలన్స్‌కు వార్నింగ్ ఇచ్చే సీన్స్ ట్రైలర్‌కు హైలైట్‌గా నిలిచాయి. హీరో లో మెంటల్ లెవల్ ని టచ్ చేసినట్లు కనిస్తుంది. కోపం ఎగిరి



పోతుందంటే నన్ను కొట్టవే బాబు! అంటూ ట్రైలర్ చివర్లో విజయ్ దేవరకొండ అనగానే మృణాల్ అతడి చెంపపై లాగి పెట్టి కొట్టడం ఆకట్టుకుంటోంది. ఆ స్టార్ హీరో మాటే నిజమైంది! మిడిల్ క్లాస్ కుర్రాడిలో స్టైలిష్‌గా కనిపిస్తూనే కామెడీతోనే నవ్వించాడు. హీరో-హీరోయిన్ల ఇద్దరి మధ్య కెమిస్ట్రీ హైలైట్. ప్రస్తుతం ట్రైలర్ ట్రెండింగ్‌లో ఉంది. రిలీజైన కొద్ది నిమిషాల్లోనే సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. ఈ చిత్రాన్ని ఏప్రిల్ లో తెలుగు..తమిళ..హిందీ భాషల్లో రిలీజ్ చేస్తున్నారు. ఈ చిత్రానికి గోపీ సుందర్ సంగీతం అందిస్తున్నారు.



## ఫ్యాన్స్ తెలుసుకుని తీరాలి!

పౌరాణిక కథలతో సినిమాలు తీయడం సాహసం. వాటిలో పాత్రల్ని పాత్రధారుల్ని గొప్పగా మలిచి పౌరాణిక కథలతో సినిమాలు తీయడం సాహసం. వాటిలో పాత్రల్ని పాత్రధారుల్ని గొప్పగా మలిచి.. నాటితరంతో పోలికలు చూసేవారిని మెప్పించడం చాలా గొప్పతనం అవుతుంది. స్టేజీ డ్రామా ఆర్టిస్టులకు ధీటుగా మెప్పించేలా చేయడం అంత సులువు కాదు. పౌరాణికాలను లేదా జానపద కథలను ఎంపిక చేసుకున్న దర్శకులకు ఆర్టిస్టుల సెలక్షన్‌లో ఇలాంటి చాలా సవాళ్లు ఎదురవుతుంటాయి. ముఖ్యంగా పాత్రధారుల ఎంపిక సరిగా కుదరకపోతే ఓంరౌత్ ‘ఆదిపురుష్’ తరహాలో వైఫల్యాన్ని ఎదుర్కోవాల్సి ఉంటుంది. పరాజయంతో పాటు విమర్శలు అంతే దారుణంగా ఉంటాయి. అయితే ఇప్పుడు యష్ రావణుడిగా నటిస్తుండగా, అతడి సరసన ఒక టీవీ నటిని ఎంపిక చేయడంపై అభిమానులు గుర్రుగా ఉన్నారు. సీనియర్ టీవీ నటి సాక్షి తన్వర్ ని రామాయణం దర్శకుడు నితీష్ తివారి ఎంపిక చేసుకున్నారు. రావణుడి భార్య మండోదరిగా సాక్షి నటించాల్సి ఉంది. కానీ ఈ ఎంపిక యష్ ఫ్యాన్స్ కు రుచించడం లేదు. ఫ్యాన్స్ డైరెక్టుగా దీనిపై సోషల్ మీడియాల్లో తమ అసహనం వ్యక్తం చేస్తున్నారు. అయితే అభిమానులు గ్రహించాల్సిన విషయాలు ఇక్కడ చాలా ఉంటాయి. సాక్షి స్థానంలో ఎవరైనా యువనటి లేదా గ్లామర్ ఎక్కువగా ఉన్న నటీమణిని ఎంపిక చేయడం సరైనదేనా? ముఖాభినయం, అద్భుత ఆహార్యంతో రక్తి కట్టించే సీనియర్ నటి ఆ పాత్రకు అవసరం. నితీష్ జీ ఆలోచన ఆ కోవలోనే సాగింది. అందుకే సాక్షి తన్వర్ లాంటి సీనియర్ బుల్లితెర నటిని ఎంపిక చేసుకున్నాడు. అయినా రామాయణంలో మండోదరి నటన కంటే రావణుడిగా యష్ నటన ఎలా ఉంటుంది? అన్నది చాలా కీలకం. మండోదరి పాత్ర చాలా పరిమితంగా ఇలా వచ్చి వెళ్లేదిగా ఉండొచ్చు. అందువల్ల అభిమానులు తమ అవివేకాన్ని ప్రదర్శించడం తగదని ఒక సెక్షన్ విశ్లేషిస్తోంది. సాక్షి తన్వర్ ఇప్పటికే ప్రీప్రిపరేషన్ వర్క్ లో బిజీగా ఉన్నారని తెలిసింది. ఆ స్టార్ హీరో మాటే నిజమైంది! ఆదిపురుష్ విషయంలో దర్శకుడు ఓంరౌత్ చేసిన తప్పిదాలను ఇప్పుడు పౌరాణిక, జానపద కథలు హిస్టారికల్ కథలు ఎంపిక చేసుకుని సినిమాలు తీసే దర్శకులు గుర్తు చేసుకుంటున్నారు. అలాంటి కథలను ఎంపిక చేసుకుంటే పాత్రధారులు మాట్లాడే భాష, కాస్ట్యూమ్స్, కాలాదులతో పాటు ఆర్టిస్టుల ఎంపికల విషయంలో రాజీకి రాకూడదు. నటీనటుల సీనియారిటీ కూడా కీలకం. అందువల్ల గ్లామర్ కోసం పాకులాట తగదనేది గమనార్హం. దర్శకుడు నితీష్ తివారీ సుదీర్ఘ అనుభవం ఉన్న దర్శకరచయితగా ప్రీప్రొడక్షన్ దశలో రామాయణం కోసం చాలా సమయం వెచ్చించి మంచి ఆర్టిస్టులను ఎంపిక చేసుకుంటున్నారు.

యంగ్ హీరో నవీన్ పొలిశెట్టికి అమెరికాలో యాక్సిడెంట్ అయినట్టుగా తెలుస్తోంది. బైక్ మీద నుంచి పడిపోవడంతో చేతికి గాయాలు అయ్యాయట. దీంతో రెండు నెలలు విరామం తీసుకోవాలని వైద్యులు సూచించారట. ఇదేమీ షూటింగ్‌లో జరిగిన ప్రమాదం కాదని తెలుస్తోంది. యంగ్ హీరో నవీన్ పొలిశెట్టికి అమెరికాలో ప్రమాదం జరిగిందనే వార్త నెట్టింట్లో బాగా ట్రెండ్ అవుతోంది. షూటింగ్‌లో భాగంగా ఈ ప్రమాదం జరిగిందా? అని చాలా మంది అనుకుంటున్నారు. కానీ ఇదేమీ షూటింగ్‌లో భాగంగా జరిగినట్టుగా కనిపించడం లేదు. ఈ బైక్ ప్రమాదంలో నవీన్ చేతికి గాయాలయ్యాయట. చేతికి ఫ్యాక్చర్ అవ్వడంతో నవీన్ పొలిశెట్టి రెండు నెలలు విశ్రాంతి తీసుకోవాల్సి

## నవీన్ పొలిశెట్టికి ప్రమాదం.. రెండు నెలలు విశ్రాంతి



వస్తుందట. అంటే నవీన్ పొలిశెట్టి సినిమాలు మరింతగా ఆలస్యం అయ్యేలా ఉన్నాయి. నవీన్ పొలిశెట్టి థియేటర్లో నవ్వించి చాలా రోజులే అవుతోంది. చివరగా అనుష్క శెట్టితో కలిసి నవీన్ పొలిశెట్టి థియేటర్లోకి వచ్చాడు.మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి మూవీ ఎంతో డీసెంట్‌గా ఉండటం, ఫ్యామిలీ ఆడియెన్స్‌కి బాగా నచ్చడంతో బాక్సాఫీస్ వద్ద మంచి విజయాన్ని అందుకుంది. అటు అనుష్కకు, ఇటు నవీన్ పొలిశెట్టికి నటన పరంగానూ మంచి పేరు తెచ్చి పెట్టింది. జాతి రత్నాలు, మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి సినిమాలతో నవీన్ బాగానే క్రేజ్ దక్కించుకున్నాడు. నవీన్ పొలిశెట్టి ప్రస్తుతం వరుస చిత్రాలతో బిజీగానే ఉన్నాడు. త్వరలోనే మూవీ అప్డేట్‌లు ఇస్తానంటూ నవీన్ వేసిన ట్వీట్ బాగానే వైరల్ అయింది. జాతి రత్నాలు 2 కూడా ఉంటుందన్నాడు. అయితే మంచి కంటెంట్ ఉన్న సినిమాలు ఇవ్వాలనే ప్రయత్నం చేస్తున్నానని, త్వరలోనే అందరినీ నవ్వించేందుకు థియేటర్లోకి వస్తాను అన్నట్టుగా చెప్పుకొచ్చాడు. కానీ ఇంతలోనే ఇలా బెడ్ రెస్ట్ తీసుకునే పరిస్థితికి నవీన్ పొలిశెట్టి వచ్చేశాడు.

అల్లు అర్జున్ తాజాగా వేసిన ఇన్ స్టా స్టోరీ పోస్ట్, ట్వీట్ మీద చర్చలు జరుగుతున్నాయి. లాంచ్ అని చెప్పాల్సింది పోయి.. లంచ్ అని స్పెల్లింగ్ మిస్టేక్ వేశాడు. దీంతో నెట్టింట్లో క్షణాల్లో వైరల్ కాసాగింది. బన్నీ వేసిన ట్వీట్, పోస్ట్ మీద చర్చలు జరుగుతుండటంతో.. వెంటనే పొరబాటుని గమనించినట్టుగా ఉన్నారు. క్షణాల్లో ఆ ట్వీట్, ఇన్ స్టా స్టోరిని డిలీట్ చేసి మళ్లీ ఫ్రెష్‌గా స్పెల్లింగ్ మిస్టేక్స్ లేకుండా వేశారు. అసలు ఇంతకీ జరిగిన మ్యాటర్ ఏంటి? ఆ పోస్ట్‌లో ఉన్న సారాంశం ఏంటంటే.. దుబాయ్‌లోని మేడం టుస్సాడ్స్ మ్యూజియంలో బన్నీ మైనపు విగ్రహాన్ని త్వరలోనే లాంచ్ చేయబోతోన్నారట. ఈ విషయాన్ని బన్నీ తన ఇన్ స్టాగ్రాం స్టోరీ ద్వారా ప్రకటించేశాడు. ఈ క్రమంలోనే లాంచ్ అని చెప్పబోయి.. లంచ్ అని టైప్ చేసినట్టున్నాడు. ఇప్పుడు ఇదే విషయం మీద

## లాంచ్ అయి ఉంటుందిలే..

నెట్టింట్లో ట్రోలింగ్ జరుగుతోంది. బన్నీ మైనపు విగ్రహం కంటే.. ఈ తప్పు మీదే అందరి ఫోకస్ పడింది. బన్నీ పీఆర్ టీం అత్యుత్సాహం వల్లే ఈ తప్పు జరిగి ఉంటుందని నెటిజన్లు అంటున్నారు. కంగారులో ఏదో ఒక వేసేయాలని.. అలా లాంచ్‌కి బదులు లంచ్ అని వేసి ఉంటారని అంటున్నారు. నెటిజన్లు సైతం తమ్ముడు సినిమాలో అచ్యుత్ మాదిరి.. లంచ్ ఆ??. లాంచ్ అయి ఉంటుందిలే అని చదువుకుని నవ్వేసుకుంటున్నారు. ఆ స్పెల్లింగ్ మిస్టేక్‌ను మాత్రం వెంటనే కరెక్ట్ చేసింది బన్నీ టీం. వెంటనే కొత్త పోస్ట్ వేశారు. ట్విట్టర్‌లో ట్వీట్ డిలీట్ చేసి మళ్లీ కొత్తగా వేశారు. లండన్ మ్యూజియంలో ఆల్రెడీ ప్రభాస్, మహేష్ బాబు మైనపు విగ్రహాల్ని పెట్టారన్న సంగతి తెలిసిందే. దుబాయ్‌లో మాత్రం బన్నీదే మొదటి మైనపు విగ్రహం కావడం విశేషం.



## వదిలి ఉండలేకపోయిన నయనతార?

విఘ్నేశ్ శివన్ ఏదో షూటింగ్ నిమిత్తం అలా 20 రోజులు బయటకు వెళ్లినట్టుగా ఉన్నాడు. అయితే ఈ ఇరవై రోజులు పిల్లలను నయనతారే చూసుకున్నట్టుగా ఉంది. పని ముగించుకుని విఘ్నేశ్ శివన్ రావడంతో పిల్లలతో పాటు నయనతార ఎగిరి గంతేసినట్టు ఉంది. నయనతార ప్రస్తుతం ఫ్యామిలీకి ఎక్కువగా టైం కేటాయిస్తున్నట్టుగా కనిపిస్తోంది. ఇక విఘ్నేశ్ శివన్ తన సినిమా షూటింగ్ కోసం 20 రోజులు బయటకు వెళ్తే.. పిల్లలతో పాటు నయన్ ఉన్నట్టుగా తెలుస్తోంది. పిల్లలు తమ తండ్రిని 20 రోజులు చూడకుండా ఒక్కసారిగా చూస్తే ఎలా అవుతారో.. నయన్ కూడా అలానే ఎగిరి గంతేసినట్టుగా కనిపిస్తోంది. ఇరవై రోజులు అలా ఓ షెడ్యూల్ కోసం బయటకు వెళ్లినప్పుడు నిన్ను ఎంతగానో మిస్ అయ్యాం.. నిన్ను ఇలా చూడటంతో మేం ముగ్గురం ఎంతో ఆనందంగా ఉన్నామంటూ నయన్ తన పిల్లలు, భర్తతో ఉన్న ఫోటోలను షేర్ చేసింది. అంటే భర్తను అలా వదిలి నయన్ ఉండలేకపోతోందని తెలుస్తోంది. ఇక పిల్లలు సైతం తండ్రి కోసం బాగానే అల్లరి చేసినట్టు అర్థం అవుతోంది. మొత్తానికి నయన్ మాత్రం ఇప్పుడు ఫ్యామిలీ లైఫ్‌ను బాగానే ఎంజాయ్ చేస్తోంది. భర్త, పిల్లల ప్రేమతో నయన్ ఎంతో సంతోషంగా ఉందని కనిపిస్తోంది. ఇక ఇప్పుడు నయన్ సైతం సినిమాల కంటే ఫ్యామిలీకే ఎక్కువగా టైం కేటాయిస్తున్న సంగతి తెలిసిందే. నయన్ ప్రస్తుతం ఎటువంటి కాంట్రవర్సీలను తన నెత్తి మీద వేసుకోవాలని అనుకోవడం లేదు. అందుకే అన్నపూరని మూవీ టైంలో వచ్చిన వివాదానికి వెంటనే ముగింపు పలకింది. తనకు దేవుడంటే నమ్మకమని, పుణ్యక్షేత్రాలు సందర్శిస్తుంటానని, తాను ఎవ్వరి మనోభావాలను దెబ్బ తీయాలని అనుకోవడం లేదని అన్నపూరణి కాంట్రవర్సీ సన్నివేశాల మీద క్లారిటీ ఇచ్చింది. ఎవరి మనోభావాలైనా దెబ్బ తిని ఉంటే క్షమించండి అంటూ నయన్ కోరింది. నయనతార చివరగా చిరంజీవి గాడ్ ఫాదర్ సినిమాలో కనిపించింది. అందులో చిరుకి చెల్లిగా నయన్ నటించింది.



## వారియర్ అంటోన్న రేణూ దేశాయ్

అకిరా నందన్ ప్రస్తుతం తనకు నచ్చినట్టుగా ఉంటున్నాడు. మ్యూజిక్ ఇష్టం కాబట్టి.. మ్యూజిక్ క్లాసులకు వెళ్తున్నాడు. బాస్కెట్ బాల్ ఇష్టం కాబట్టి.. వీలుచిక్కినప్పుడల్లా ఆడేస్తుంటాడు. ఇక సమయం సందర్భాన్ని బట్టి అకిరా నందన్ పియానో వాయించేస్తుంటాడు. సంక్రాంతి సెలెబ్రేషన్స్‌లో భాగంగా అకిరా నందన్ వాయించిన పాటకు అందరూ ఫిదా అయ్యారు. పవన్ కళ్యాణ్ మీదున్న ప్రేమను అలా పాట రూపంలో చూపించేశాడని అంతా సంబరపడిపోయారు. అలా అకిరా నందన్ చర్యలు ఊహాతీతంగా ఉంటాయి. పవన్ కళ్యాణ్ ఫ్యాన్స్ ఏమో అకిరా ఎంట్రీ కోసం చూస్తున్నారు. అకిరా మాత్రం ఎప్పుడూ కూడా సినిమా ఎంట్రీ మీద ఫోకస్ పెట్టినట్టుగా అనిపించదు. కనిపించదు.

రేణూ దేశాయ్ సైతం అకిరా నందన్ ఎంట్రీ మీద నర్మగర్భంగా స్పందిస్తూ ఉంటారు. అకిరాకు ఇప్పుడు ఇంట్రెస్ట్ లేదని, ఒక వేళ అకిరా సినిమాల్లోకి వస్తే మాత్రం ఆ ప్రకటన తానే ముందుగా చేస్తానని చెబుతుంటుంది. అకిరా ప్రస్తుతం ఎలాంటి మూడ్‌లో ఉన్నాడో చూపించేలా ఓ హింట్ ఇస్తూ వీడియోను వదిలింది. ఇందులో అకిరాను చూస్తుంటే నిజంగానే ఓ యోధుడిలా ఉన్నాడు.

ఓ వైపు ఆధ్యాత్మికంగా కనిపిస్తూనే.. మరో వైపు ఏదో సీరియస్‌గా కసరత్తులు చేసినట్టుగా అనిపిస్తోంది. అలా సూర్యాస్తమయంలో ఆ డ్రెస్సులో అకిరా కనిపిస్తుండటంతో.. అసలు అకిరా ఏం చేస్తున్నాడు.. ఏం ప్రాక్టీస్ చేస్తున్నాడనే ఆలోచనలు అభిమానులు సహజంగానే పుట్టుకొస్తాయి. కానీ రేణూ దేశాయ్ మాత్రం తన కామెంట్ సెక్షన్‌ను క్లోజ్ చేయడంతో ఆమెను అడిగేందుకు ఆస్కారం లేకుండా పోయింది. మై వారియర్ సన్ అంటూ అకిరా గురించి రేణూ దేశాయ్ షేర్ చేసిన ఈ వీడియో మాత్రం అభిమానుల్ని ఆకట్టుకుంటోంది. మరి అకిరా ఎంట్రీ ఎప్పుడెప్పుడు ఉంటుందా? అంటూ అభిమానులు ఆత్రుతగా ఎదురుచూస్తూనే ఉన్నారు.

## అప్పుడే మీకు అర్థం అవుతుంది..



రామ్ చరణ్ బర్త్ డే సందర్భంగా బుధవారం సాయంత్రం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో టాలీవుడ్ సెలెబ్రిటీలు సందడి చేశారు. ఈ ఈవెంట్‌లో దిల్ రాజు మాట్లాడుతూ గేమ్ చేంజర్ అప్డేట్లు ఇచ్చాడు. ఈ క్రమంలో లేట్ అవుతోందని తనను తిట్టుకోవద్దని చెప్పుకొచ్చాడు. రామ్ చరణ్ బర్త్ డే సందర్భంగా బుధవారం నాడు శిల్పా కళా వేదికలో గ్రాండ్‌గా ఈవెంట్‌ను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో దిల్ రాజు, మంచు మనోజ్ వంటి వారు స్పెషల్ గెస్టులుగా వచ్చారు. ఈ వేడుకలో దిల్ రాజు మాట్లాడుతూ గేమ్ చేంజర్ అప్డేట్లను ఇచ్చారు. అప్డేట్లు ఆలస్యం అవుతోందంటూ తనను తిట్టుకోకండని, కాస్త ఓపికతో ఉండండని సినిమాను శంకర్ అద్భుతంగా తీస్తున్నాడంటూ దిల్ రాజు చెప్పుకొచ్చాడు. గ్లోబల్ స్థాయికి ఎదిగిన రామ్ చరణ్ గేమ్ చేంజర్ సినిమా కూడా అదే స్థాయిలో ఉంటుందని చెప్పుకొచ్చాడు. ఆర్ఆర్ఆర్ సినిమా తరువాత వస్తోంది కాబట్టి.. ఆ రేంజ్‌లో సినిమా రావాలి.. అందుకే శంకర్ ప్రతీ సీన్, ప్రతీ సాంగ్‌ను చెక్కుతున్నాడు అని దిల్ రాజు చెప్పుకొచ్చాడు. మీరు జరగండి పాటలో చూసింది కేవలం రెండు శాతమే.. ఇంకా చాలా ఉందని.. సినిమా చూస్తే మీకే అర్థం అవుతుందని హైప్ పెంచేశాడు దిల్ రాజు. అప్డేట్ల కోసం మీరు నన్ను తిడుతున్నారని, కొన్ని కామెంట్లు మా టీం చూపిస్తుంది.. అరేయ్ దిల్ మామా అప్డేట్లు ఇవ్వు అని అంటుంటారని చూశా. కానీ అప్డేట్లు నేను ఇవ్వలేను.. పై నుంచి రావాలి.. కాస్త ఓపిక పట్టండి.. నన్ను తిట్టుకోకండి.. త్వరలోనే షూటింగ్ అవుతుంది.. నాలుగైదు నెలల్లోనే సినిమాను రిలీజ్ చేస్తామంటూ దిల్ రాజు అన్ని విషయాలను చెప్పుకొచ్చాడు. నేను ఈ సినిమా విషయంలో ఎలాంటి లీకులు ఇవ్వలేను. నాలుగైదు నెలల్లోనే సినిమా వస్తుంది. ఈ ఏడాది బర్త్ డే రామ్ చరణ్‌కు ఎంతో స్పెషల్.. అతని జీవితంలోకి క్లీంకార వచ్చింది.. నేటి ఉదయమే తిరుమలకు వెళ్లి దర్శనం చేసుకుని వచ్చాడు.. గేమ్ చేంజర్ పాట మాస్‌లోకి బాగా వెళ్ళింది.. ఇంకో మూడు రోజులు ఆగితే..ఆ పాట గురించి ప్రతీ ఒక్కరూ మాట్లాడుకుంటారు.. ఎందుకంటే ఆ సాంగ్ లీకైంది కాబట్టి అలానే అనిపిస్తుంది.. లిరికల్ వీడియోలో విజువల్ ట్రీట్‌తో అంతగా సంతృప్తి చేయలేం.. కానీ థియేటర్లో ఈ పాట పడితే మాత్రం సీట్లలో కూర్చోలేరు అది మాత్రం గ్యారెంటీ అని దిల్ రాజు చెప్పుకొచ్చాడు.

## మోహన్ బాబు చిరంజీవిల మధ్య గొడవ..



రామ్ చరణ్ గురించి మంచు మనోజ్ మాట్లాడిన మాటలు, ఇచ్చిన ఎలివేషన్స్, మంచు మెగా ఫ్యామిలీ మధ్య ఉండే వైరం గురించి చెప్పిన మాటలు, చివర్లో వేసిన డైలాగ్ అందరినీ ఆకట్టుకుంటోంది. ఇంతకీ మనోజ్ తన స్పీచులో చెప్పిన అంశాలు, విషయాలు ఏంటో ఓ సారి చూద్దాం. రామ్ చరణ్ నాకు ప్రాణ మిత్రుడు.. అలాంటి రామ్ చరణ్ బర్త్ డే ఈవెంట్‌కు ఇలా రావడం ఆనందంగా ఉంది. ప్రతీ ఏడాది అభిమానులు ఎంతో గ్రాండ్‌గా సెలెబ్రేషన్స్ చేస్తారు.. రామ్ చరణ్ చిన్నతనం నుంచీ తనతో ఉన్న స్నేహితులతో ఇప్పటికీ అలానే ఉన్నారు.. ఈ కాలంలో స్నేహం దొరకడం చాలా కష్టం.. అందరూ స్థాయి పెరిగాక కొత్త స్నేహాలతో బిజీగా ఉంటారు.. పాత వారిని మరిచిపోతారు.. కానీ రామ్ చరణ్ మాత్రం ఇంకా తన చిన్న నాటి స్నేహితులతోనూ అలానే ఉంటాడు.. మేం చెన్నైలో అంతా కూడా పక్కపక్కనే ఉండేవాళ్లం. రామ్ చరణ్‌కు పక్కన వారికి సాయం చేయడం అంటే ఇష్టం. ఎవరు ఏ కష్టాల్లో ఉన్నా సాయం చేస్తుంటాడు.. అదే రామ్ చరణ్ గ్రేట్ నెస్. ఓ సారి ఓ కుటుంబం దుబాయ్‌లో చిక్కుకుంది. ఓ ఆడబిడ్డ కుటుంబం కష్టాల్లో ఉందని తెలిసింది. నా వంతుగా నేను సాయం చేశాను.. నాకు ఇంకా డబ్బు కావాల్సి వచ్చింది.. ఆ అర్ధరాత్రి ఎవరికి ఫోన్ చేయాలా? అనుకున్నా.. అలా అర్ధరాత్రి రామ్ చరణ్‌కు ఫోన్ చేసి ఐదు లక్షలు అడిగాను.. బాబాయ్ ఇలా ఓ ఆడబిడ్డకు కష్టం ఉందని చెప్పా.. వెంటనే ఐదు లక్షలు కొట్టేశాడు.. అదీ రామ్ చరణ్ గొప్పదనం. చిరంజీవి గారు మోహన్ బాబు గారు అలా గొడవలు పెట్టుకుంటారు.. మరి వారి పిల్లలైన మీరు మాత్రం ఇంత కాలం స్నేహితులుగా ఎలా ఉన్నారు అని అంతా అడుగుతుంటారు.. భార్యాభర్తల గొడవల్లోకి మధ్యలోకి వెళ్తే ఏం అవుతుంది.. అలానే వారిద్దరి మధ్యలోకి కూడా వెళ్లొద్దు.. వారిద్దరూ కూడా అలాంటి వారే.. టామ్ అండ్ జెర్రీ టైపు.. వాళ్లది 45 ఏళ్ల బంధం.. రిలేషన్ షిప్ బిట్వీన్ మంచు ఫ్యామిలీ అండ్ మెగా ఫ్యామిలీ షుడ్ బీ లైక్ ఫిష్ అండ్ వాటర్.. బట్ నాట్ ఫిష్ అండ్ ఫిషర్ మెన్ అని డైలాగ్ చెప్పి ముగించాడు.